www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

సంపుటి - 3 సంచిక -153 బుధవారం 3 సెప్టెంబర్ 2025 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు -8 వెల - 3/-

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545



## కోట్లాది తల్లులకు జరిగిన అవమానం

**రాజకుటుంబంలో పుట్టిన రాహుల్ కు ఒక పేద తల్లి పడిన బాధ,**

**ఆమె కొడుకు పోరాటం అర్థం కావు: ప్రధాని మోదీ**

**తన తల్లి హీరాబెన్‌పై అనుచిత వ్యాఖ్యలు, తీవ్రంగా స్పందించిన మోదీ**

**న్యూఢిల్లీ సెప్టెంబర్2 ప్రజావినికిడి:**
దివంగతురాలైన తన తల్లి హీరాబెన్‌ను ఉద్దేశించి బీహార్ లో కొందరు అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భావోద్వేగంతో స్పందించారు. అది కేవలం తన తల్లికి జరిగిన అవమానం కాదని, దేశంలోని కోట్లాది మంది తల్లులు, సోదరీమణులను కించపరచడమేనని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బీహార్‌లో ఇటీవల కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ నిర్వహించిన ఓ ర్యాలీలో ఈ వ్యాఖ్యలు చేసినట్లు బీజేపీ ఆరోపించింది.మిగతా 2లో...

# లాజిస్టిక్స్ గేట్ వేగా తూర్పు తీరం

## ఇది రాష్ట్ర భవిష్యత్తును మార్చే మాస్టర్ ప్లాన్: సీఎం చంద్రబాబు


**ప్రతి ఓడరేవుకు కనెక్టివిటీ మాస్టర్ ప్లాన్ రూపకల్పన**

**జల, వాయు, రోడ్డు, రైలు మార్గాలను అనుసంధానించేలా సమీకృత వ్యవస్థ**

**పొరుగు రాష్ట్రాల కార్గో రవాణాను ఆకర్షించడంపై ప్రత్యేక దృష్టి**

**త్వరలో ఏపీ లాజిస్టిక్స్ కార్పొరేషన్, లాజిస్టిక్స్ యూనివర్సిటీ ఏర్పాటు**

**పోర్టుల వద్ద పారిశ్రామిక క్లస్టర్లు, టౌన్ షిప్ ల నిర్మాణానికి ప్రణాళికలు**



**అమరావతి, సెప్టెంబర్2 ప్రజావినికిడి:**
ఆంధ్రప్రదేశ్ ను తూర్పు తీరానికి ప్రధాన మారిటైమ్ లాజిస్టిక్స్ గేట్ వేగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ప్రతి ఓడరేవును జాతీయ, అంతర్జాతీయ వాణిజ్యానికి కేంద్రంగా మార్చేందుకు వీలుగా జల, వాయు, రోడ్డు, రైలు మార్గాలను అనుసంధానిస్తూ ఒక సమగ్రమైన కనెక్టివిటీ మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నట్లు ప్రకటించారు. రాష్ట్ర భవిష్యత్తును మార్చే ఈ కీలక ప్రణాళికతో ఏపీని దేశంలోనే అగ్రగామి లాజిస్టిక్స్ హబ్ గా నిలబెడతామని ధీమా వ్యక్తం చేశారు.మిగతా 2లో...



## ఎమ్మెల్సీ కవిత సస్పెన్షన్

**బిఆర్ఎస్ పార్టీ సంచలన నిర్ణయం**

**హరీష్, సంతోష్‌లపై విమర్శలతో పార్టీ సీరియస్**

**అధ్యక్షుడి ఆదేశాలతో సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటన**

**హైదరాబాద్, సెప్టెంబర్2 ప్రజావినికిడి:**
బిఆర్ఎస్ సంచలన నిర్ణయం తీసుకుంది. పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ కుమార్తె, ఎమ్మెల్సీ కవితను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు-ప్రకటించింది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలను తీవ్రంగా పరిగణిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు- తెలిపింది.మిగతా 2లో...

## అమరావతిలో కీలక నిర్మాణాలు త్వరగా పూర్తి

**నగరం ఆకర్షణీయంగా కనిపించేలా నిర్మాణాలు**

**52వ సీఆర్డీఏ అథార్టీ సమావేశంలో చంద్రబాబు**




## సుగాలి ప్రీతి కేసు దర్యాప్తు సీబీఐకి



**కీలక నిర్ణయం తీసుకున్న కూటమి ప్రభుత్వం!**

**ఈ కేసుపై పవన్ కల్యాణ్ ప్రత్యేక దృష్టి**

**ఎల్లుండి కేబినెట్ సమావేశంలో చర్చకు రానున్న అంశం**

**అమరావతి, సెప్టెంబర్2 ప్రజావినికిడి:**
ఆంధ్రప్రదేశ్‌లో తీవ్ర సంచలనం సృష్టించిన సుగాలి ప్రీతి కేసు దర్యాప్తులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసును సీబీఐకి అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. దీనికి సంబంధించి త్వరలోనే సీబీఐకి అధికారికంగా లేఖ రాయనుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ కేసుపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఆయన సీఐడీ ఉన్నతాధికారులతో సమావేశమై కేసు పురోగతిపై ఆరా తీశారుమిగతా 2లో...

## ‘ఓరి నీ పాసుగాల’ జగన్ పై లోకేశ్ సెటైర్లు

**పులివెందుల పర్యటనలో ఉన్న జగన్**

**జగన్ ను కలిసేందుకు పాస్ లు జారీ చేశారనే వార్త వైరల్**

**కార్యకర్తలను కలిసేందుకు పాసులు ఏందయ్యా : లోకేశ్ సెటైర్**



**అమరావతి, సెప్టెంబర్2 ప్రజావినికిడి:**
ఓరి నీ పాసుగాల! .. అంటూ వైసీపీ అధినేత జగన్ పై మంత్రి నారా లోకేశ్ సెటైర్లు వేశారు.మిగతా 2లో...

## కేంద్రం ఎన్ఈపీకి తెలంగాణ చెక్.. సొంత విద్యా విధానానికి శ్రీకారం

**కేంద్రం ఎన్ఈపీకి బదులు తెలంగాణ సొంత విద్యా విధానం**


**నూతన పాలసీ రూపకల్పనకు ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు**

**కమిటీ ఛైర్మన్‌గా ప్రభుత్వ సలహాదారు కేశవరావు నియామకం**

**అక్టోబరు 30లోగా నివేదిక సమర్పించాలని ప్రభుత్వ ఆదేశం**

**‘తెలంగాణ రైజింగ్-2027’ లక్ష్యంగా విద్యా సంస్కరణలు**

**2026-27 నుంచి కొత్త విధానం అమలుకు ప్రణాళిక**




## వైఎస్ఆర్ కు జగన్ నివాళి

**ఇడుపులపాయలో వైఎస్ఆర్ ఘాట్ వద్ద నివాళులర్పించిన వైఎస్ జగన్**

**మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి 16వ వర్ధంతి**

**ఏపీ వ్యాప్తంగా వైఎస్ఆర్ కు నివాళులర్పిస్తున్న నేతలు, అభిమానులు**

**అమరావతి, సెప్టెంబర్2(జర్నలిస్ట్ వార్త):**
మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 16వ వర్ధంతి సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ నేతలు, అభిమానులు కార్యక్రమాలు నిర్వహిస్తూ ఘనంగా నివాళులర్పిస్తున్నారు. వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ఇడుపులపాయలోని వైఎస్ఆర్ ఘాట్ వద్ద పాల్గొని నివాళులర్పించారు. మిగతా 2లో...



## కేసీఆర్, హరీశ్ రావులకు హైకోర్టు ఊరట



**కాళేశ్వరం నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవద్దన్న హైకోర్టు**

- **కేసీఆర్, హరీశ్ పిటిషన్లపై విచారణ అక్టోబర్ 7కి వాయిదా**
- **అప్పటి వరకు చర్యలు తీసుకోవద్దని ఆదేశం**

**హైదరాబాద్, సెప్టెంబర్2 ప్రజావినికిడి:**
కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ సమర్పించిన నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు చేపట్టవద్దని తెలంగాణ ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసింది. కమిషన్ నివేదిక ఆధారంగా తమపై చర్యలు తీసుకోకుండా ప్రభుత్వాన్ని నిరోధించాలని కోరుతూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు దాఖలు చేసిన పిటిషన్‌పై ఉన్నత న్యాయస్థానం విచారణ చేపట్టింది.
మిగతా 2లో...

## వారం రోజుల్లో 27,470 మెట్రిక్ టన్నుల యూరియా

**సరఫరాలో రైతులకు ఇబ్బందులు రాకుండా పంపిణీ**

**5 రోజులలో పంట నష్టం సర్వే పూర్తి**

**అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశాలు**



# వైఎస్ కలలుకన్న ప్రాణహిత చేపట్టి పూర్తి చేస్తాం

## వైఎస్సార్ మెమోరియల్ అవార్డుల కార్యక్రమంలో సీఎం రేవంత్

**ఉచిత విద్యుత్ అంటే వైఎస్**

**ఆరోగ్యశ్రీ అన్నా..వైఎస్సే**

**ఎవ్వరు కూడా రద్దు చేయని పథకాలు అవి**

**వైఎస్ బాటలోనే తానూ ముందుకు వెళుతున్నా**

**సేంద్రియ వ్యవసాయవేత్త సుభాష్ పాలేకర్‌కు అవార్డు అందచేత**

**హైదరాబాద్, సెప్టెంబర్2 ప్రజావినికిడి:** రైతులకు ఉచితవిద్యుత్ అందించాలన్న సంకల్పంతో దానిని అమలుచేయడం ద్వారా మాజీ సీఎం దివంగత వైఎస్సార్ చెరగని ముద్ర వేశారని మిగతా 2లో...



## 'ఓరి నీ పాసుగాల' జగన్ పై లోకేశ్ సెటైర్లు

(మొదటి పేజీ తరువాయి)

ప్రస్తుతం జగన్ పులివెందుల పర్యటనలో ఉన్నారు. తన తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద ఆయన నివాళి అర్పించారు. మరోవైపు, పులివెందులలో జగన్ ను కలవడానికి వైసీపీ వీఐపీ పాస్ లు అందజేసింది అనే వార్త వైరల్ అయింది. దీనిపై నారా లోకేశ్ ఎక్స్ వేదికగా స్పందించారు. "ఓరి నీ పాసుగాల! సినిమా ఫంక్షన్లకు వీఐపీ పాసులు విన్నాం గానీ.. సొంత నియోజకవర్గంలో సొంత పార్టీ కార్యకర్తలను కలవడానికి పాసులు ఏందయ్యా? ఎప్పుడూ వినలే.. చూడలే" అంటూ పోస్ట్ చేశారు.

## కేసీఆర్, హరీశ్ రావులకు హైకోర్టు ఊరట

(మొదటి పేజీ తరువాయి)

విచారణ సందర్భంగా, రాష్ట్ర ప్రభుత్వం తరపున అడ్వొకేట్ జనరల్ వాదనలు వినిపించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవకతవకల కేసును దర్యాప్తు కోసం సీబీఐకి అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు ఆయన కోర్టుకు తెలిపారు. సీబీఐ దర్యాప్తునకు, జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదికకు ఎలాంటి సంబంధం ఉండదని కూడా ఏజీ స్పష్టం చేశారు.

ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం, ఈ పిటిషన్‌పై లోతైన విచారణ జరపాల్సి ఉందని అభిప్రాయపడింది. వెకేషన్ అనంతరం దీనిపై విచారణ చేపడతామని పేర్కొంటూ, తదుపరి విచారణను అక్టోబర్ 7వ తేదీకి వాయిదా వేసింది. అప్పటివరకు పిటిషనర్లపై జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా ఎటువంటి చర్యలు తీసుకోరాదని స్పష్టం చేసింది. ఈ ఉత్తర్వులతో కేసీఆర్, హరీశ్ రావులకు తాత్కాలికంగా ఊరట లభించినట్లయింది.

## వైఎస్ఆర్ కు జగన్ నివాళి

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా మత పెద్దలు నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో జగన్ దంపతులు, కుటుంబ సభ్యులు, వైసీపీ నేతలు పాల్గొన్నారు. వైఎస్ఆర్ అర్ధాంగి విజయమ్మ, వైఎస్ భారతి, ఇతర కుటుంబ సభ్యులు ఘాట్ వద్ద నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కడప ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి, తిరుపతి ఎంపీ గురుమూర్తి, మాజీ డిప్యూటీ ముఖ్యమంత్రులు నారాయణస్వామి, అంజాద్ బాషా, మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్, ఎమ్మెల్యే ఆకెపాటి అమర్ నాథ్ రెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రవీంద్ర నాథ్ రెడ్డి, గడికోట శ్రీకాంత్ రెడ్డి, రఘురామ్ రెడ్డి, బియ్యపు మధుసూదన్ రెడ్డి, కోరుముట్ల శ్రీనివాసులు తదితరులు ఘాట్ వద్దకు చేరుకుని నివాళులు అర్పించారు.

## కోట్లాది తల్లులకు జరిగిన అవమానం

(మొదటి పేజీ తరువాయి)

మంగళవారం నాడు బీహార్‌కు చెందిన సుమారు 20 లక్షల మంది మహిళలతో వర్చువల్ సమావేశంలో ప్రధాని మోదీ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "కాంగ్రెస్, ఆర్జేడీ నేతలు పాల్గొన్న సభలో నా తల్లిని దూషించారు. ఆ మాటలు నన్ను తీవ్రంగా బాధించాయి. బీహార్ ప్రజలు కూడా ఈ వ్యాఖ్యలతో బాధపడ్డారని నాకు తెలుసు" అని అన్నారు. తన తల్లి పడిన కష్టాలను గుర్తుచేసుకుంటూ, "మా బట్టల కోసం ప్రతి పైసా కూడబెట్టింది. అనారోగ్యంతో ఉన్నా పనిచేసి కుటుంబాన్ని పోషించింది. దేశంలో అలాంటి తల్లులు కోట్లాది మంది ఉన్నారు. తల్లి స్థానం దేవుడి కంటే గొప్పది" అని మోదీ ఉద్వేగానికి లోనయ్యారు. రాజకుటుంబాల్లో పుట్టిన రాహుల్ గాంధీ, తేజస్వీ యాదవ్‌లకు ఒక పేద తల్లి పడిన బాధ, ఆమె కొడుకు చేసే పోరాటం అర్థం కావని విమర్శించారు. అధికారం కోసం స్వార్థంతో పనిచేస్తున్నారని, ప్రజలు తనను ఆశీర్వదించి ప్రధానిని చేస్తే కొందరు జీర్ణించుకోలేకపోతున్నారని మండిపడ్డారు.

మోదీ తల్లిపై వ్యాఖ్యల పట్ల బీజేపీ నేతలు పాట్నాలోని కొత్వాలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు ఒక వ్యక్తిని అరెస్ట్ చేశారు. మరోవైపు, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఈ వ్యాఖ్యలపై స్పందిస్తూ, రాహుల్ గాంధీ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

### కేంద్రం ఎన్ఈపీకి తెలంగాణ చెక్..

# సొంత విద్యా విధానానికి శ్రీకారం

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ)-2020 విషయంలో కీలక నిర్ణయం తీసుకున్న తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రానికి ప్రత్యేకంగా నూతన విద్యా విధానాన్ని రూపొందించేందుకు సిద్ధమైంది. ఇప్పటివరకు ఈ అంశంపై తటస్థ వైఖరితో ఉన్న రాష్ట్ర సర్కార్, తాజాగా సొంత పాలసీ రూపకల్పన కోసం ఏడుగురు సభ్యులతో కూడిన ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.ప్రభుత్వ సలహాదారు కేశవరావు ఈ కమిటీకి ఛైర్మన్‌గా వ్యవహరించనున్నారు. సభ్యులుగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి, తెలంగాణ ఎడ్యుకేషన్ కమిషన్ అధ్యక్షుడు ఆకునూరి మురళి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఉన్నత విద్యామండలి అధ్యక్షుడు ఆచార్య బాలకిష్టారెడ్డి నియమితులయ్యారు. విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా సభ్య కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తారు. అవసరమైతే మరో సభ్యుడిని నియమించుకునే అధికారాన్ని ఛైర్మన్‌కు కల్పించారు. ఈ కమిటీ అక్టోబరు 30వ తేదీలోగా తమ నివేదికను ప్రభుత్వానికి అందించాల్సి ఉంటుంది.

'తెలంగాణ రైజింగ్-2027' లక్ష్యానికి అనుగుణంగా కొత్త విద్యా విధానం ఉండాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. డిజిటల్ బోధన, నైపుణ్యాభివృద్ధి, ఆవిష్కరణలు, పరిశోధనలు, అంతర్జాతీయ అవకాశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించింది. పారిశ్రామిక రంగానికి, విద్యాసంస్థలకు మధ్య సంబంధాలు బలోపేతం చేసేందుకు తగిన సూచనలు చేయాలని కోరింది. పాఠశాల విద్య నుంచి ఉన్నత, సాంకేతిక విద్య వరకు అన్ని స్థాయిల్లో అవసరమైన సంస్కరణలను ఈ కమిటీ సిఫారసు చేయనుంది.

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విద్యావ్యవస్థను కాషాయీకరణ చేసేందుకే ఎన్ఈపీ-2020ని ఏకపక్షంగా తీసుకొచ్చిందని పలు రాష్ట్రాలు విమర్శిస్తున్న విషయం తెలిసిందే. కర్ణాటక, తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాలు దీనిని తీవ్రంగా వ్యతిరేకించి సొంత విధానాలను రూపొందించుకుంటున్నాయి. ఇప్పటివరకు తటస్థంగా ఉన్న తెలంగాణ సైతం ఇప్పుడు అదే బాటలో పయనిస్తోంది. ఎన్ఈపీలోని వివాదాస్పద అంశాలను పక్కనపెట్టి, రాష్ట్ర అవసరాలకు తగినట్లుగా కొన్ని ముఖ్యమైన అంశాలను స్వీకరించి ఈ కొత్త విధానాన్ని రూపొందించనున్నట్లు తెలుస్తోంది. ఈ నూతన విద్యా విధానాన్ని 2026-27 విద్యా సంవత్సరం నుంచి అమలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

# వారం రోజుల్లో 27,470 మెట్రిక్ టన్నుల యూరియా

**హైదరాబాద్, సెప్టెంబర్2 ప్రజావినికిడి:** రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఎరువుల సరఫరా విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటు-ందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గారు స్పష్టం చేశారు. రైతులకు అవసరమైన యూరియాను అందుబాటు-లో ఉంచడానికి, కేంద్రంతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతున్నామని చెప్పారు. నిన్న ఒక్కరోజులోనే రాష్ట్రానికి 9,000 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా కాగా, ఈ రోజు మరో 5,000 మెట్రిక్ టన్నులు చేరనున్నాయని వెల్లడించారు. ఈ యూరియా రైల్వే రేక్ పాయింట్లయిన సనత్ నగర్, వరంగల్, జడ్చర్ల, నాగిరెడ్డిపల్లి, మిర్యాలగూడ, కరీంనగర్, నిజామాబాద్ ప్రాంతాలకు చేరుకుంటు-ందని తెలిపారు. ఇంకా, వచ్చే వారం రోజుల్లో కరాయికల్, గంగవరం, దామ్ర పోర్టుల ద్వారా మరో 27,470 మెట్రిక్ టన్నుల యూరియా రాష్ట్రానికి చేరనుందని తెలిపారు. ఈ ఎరువులను రైతులకు ఎటు-వంటి ఇబ్బందులు కలగకుండా డిమాండ్ కు అనుగుణంగా పంపిణీ చేయాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు- మంత్రిగారు పేర్కొన్నారు. రైతులకు ఎరువుల కొరత




ఉండకుండా, అవసరమైన చోట తక్షణమే అందేలా సమన్వయం చేయాలని అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా ఇటీ-వల వర్షాల కారణంగా జరిగిన పంట నష్టానికి పరిహారం చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి తెలిపారు. రైతులకు ఎటు-వంటి అన్యాయం జరగకుండా, సకాలంలో సహాయం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. అందుకోసం పంట నష్టం సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని, 5 రోజుల్లోపు పంటనష్టంపై పూర్తి నివేదికను పూర్తి చేయాల్సిందిగా సంబంధిత అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేసినట్లు- మంత్రిగారు వెల్లడించారు. రైతుల సంక్షేమం, వారి పంటల రక్షణ రాష్ట్ర ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని మంత్రి పునరుద్ఘాటించారు.

# లాజిస్టిక్స్ గేట్ వేగా తూర్పు తీరం

(మొదటి పేజీ తరువాయి)

మంగళవారం నాడు విశాఖపట్నంలో జీఎఫ్ఎస్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఈస్ట్ కోస్ట్ మారిటైమ్ లాజిస్టిక్స్ సమ్మిట్'కు ముఖ్యమంత్రి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ కు ఉన్న సహజ అనుకూలతలను పూర్తిగా సద్వినియోగం చేసుకుంటామని తెలిపారు. "మన రాష్ట్రానికి కేవలం మన అవసరాల కోసమే కాకుండా, ఉత్తరాది రాష్ట్రాలతో పాటు పొరుగున ఉన్న తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్ గఢ్, కర్ణాటక వంటి భూపరివేష్టిత రాష్ట్రాల కార్గో రవాణాకు కూడా కీలక కేంద్రంగా మారే అపారమైన అవకాశం ఉంది. వారి సరుకును ఏపీ పోర్టుల ద్వారానే ప్రపంచానికి చేరవేసేలా ఒక పటిష్టమైన కార్యాచరణను అమలు చేస్తున్నాం" అని వివరించారు.

రాష్ట్రంలో లాజిస్టిక్స్ రంగాన్ని సమూలంగా మార్చేందుకు సమీకృత రవాణా వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. "ప్రస్తుతం ఉన్న పోర్టులు, కొత్తగా నిర్మించబోయే ఓడరేవులను కలుపుతూ జాతీయ రహదారులు, రైల్వే లైన్లు, ఎయిర్ కార్గో సదుపాయాలు, అంతర్గత జలమార్గాలను అనుసంధానిస్తాం. దీనికోసం ప్రతి పోర్టుకు ఒక ప్రత్యేక కనెక్టివిటీ మాస్టర్ ప్లాన్ ఉంటుంది. గోదావరి, కృష్ణా నదుల ద్వారా సుమారు 1,500 కిలోమీటర్ల మేర అంతర్గత జల రవాణాకు అవకాశాలున్నాయి. వీటితో పాటు, ఒకప్పుడు వాణిజ్యానికి జీవనాడిగా ఉన్న బకింగ్ హామ్ కెనాల్ ను పునరుద్ధరించి కాకినాడ-చెన్నై మధ్య జల రవాణాను తిరిగి ప్రారంభిస్తాం. ఈ చర్యలతో రవాణా వ్యయం గణనీయంగా తగ్గుతుంది" అని చంద్రబాబు అన్నారు.

ఈ సదస్సుకు ముందు ముఖ్యమంత్రి, దేశవ్యాప్తంగా వివిధ పోర్టులు, కార్గో కంపెనీలకు చెందిన 62 మంది సీఈఓలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, మౌలిక సదుపాయాల కల్పన, టెర్మినళ్ల ఆధునీకరణ, షిప్ బిల్డింగ్ వంటి అంశాలపై వారితో విస్తృతంగా చర్చించారు. భారీ నౌకలు సులభంగా రాకపోకలు సాగించేందుకు వీలుగా 18 మీటర్ల లోతైన ఓడరేవులు తూర్పు తీరంలో ఏపీలో మాత్రమే ఉన్నాయని, ఇది మనకు సానుకూల అంశం అని పేర్కొన్నారు.

## అమరావతిలో కీలక నిర్మాణాలు త్వరగా పూర్తి

రాజధానిలో కీలక నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేలా దృష్టి సారించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. మంగళవారం సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి నేతృత్వంలో 52వ సీఆర్డీఏ అథార్టీ సమావేశం జరిగింది. ఏడు అంశాలకు ఈ సమావేశంలో ఆమోదం లభించింది. రాజధాని పరిధిలో చేపట్టే కీలక ప్రాజెక్టులు కార్యరూపం దాల్చేలా స్పెషల్ పర్పస్ వెహికల్ ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టు, ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు-, స్మార్ట్ ఇండస్ట్రీస్, ఐకానిక్ బ్రిడ్జ్, స్పోర్ట్స్ సిటీ-, రివర్ ఫ్రంట్, రోప్ వే, ఇన్నర్ రింగ్ రోడ్ వంటి ప్రాజెక్టుల నిమిత్తం స్పెషల్ పర్పస్ వెహికల్ దోహద పడుతుంది. అయితే ఎస్పీవీ పరిధిలోకి బయో డిజైన్ ప్రాజెక్టును కూడా తీసుకురావాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. స్పోర్ట్స్ సిటీ తరహాలోనే హెల్త్ సిటీ- కూడా అమరావతిలో ఏర్పాటు- కానుందని.. దాని పరిధిలో బయో డిజైన్ ప్రాజెక్టు ఏర్పాటు- చేయాలని సీఎం చెప్పారు. ప్రజారోగ్య సేవల నిమిత్తం బయో డిజైన్ ప్రాజెక్టులో భాగస్వాములుగా ఉండేందుకు ఏడు దేశాలకు చెందిన నిపుణులు, సంస్థలు సిద్దంగా ఉన్నాయని సీఎం తెలిపారు. ఎస్పీవీ పరిధిలోని ప్రాజెక్టుల డిజైన్, రెవెన్యూ జనరేషన్ మొదలు నిర్మాణం పూర్తి అయ్యేంత వరకు ఎస్పీవీనే పూర్తి బాధ్యత వహించనున్నట్టు- అధికారులు సీఎంకు వివరించారు. అమరావతిలో ప్రభుత్వ భవనాల సముదాయం కోసం అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. దీనికి సంబంధించిన టెండర్ కు సీఆర్డీఏ అథార్టీ ఆమోదించింది. అమరావతి గవర్నమెంట్ కాంప్లెక్స్ భవనాలకు అనుసంధానంగా రోడ్లు, ఫుట్ పాత్ ల నిర్మాణానికి సంబంధించిన పనులు ఇకపై మొదలు కానున్నాయి. దీంట్లో భాగంగా 53.68 కిలోమీటర్ల మేర రోడ్ల నిర్మాణం చేపట్టనున్నారు. రోడ్ల నిర్మాణమే కాకుండా... ఏడేళ్ల పాటు- రోడ్ల నిర్వహణ బాధ్యతను కూడా టెండర్ దక్కించుకున్న సంస్థే చేపట్టేలా నిబంధనలు పెట్టినట్టు- అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఇక రాజధాని ప్రాంతంలో అర్బన్ డిజైన్లు, ఆర్కిటెక్చరల్ గైడ్ లైన్స్ కు సంబంధించిన నోటిఫికేషన్ జారీకి అథార్టీ ఆమోదించింది. డిజైన్లను ఆమోదించే సందర్భంలో జాగ్రత్తలు తీసుకోవాలని.. పేర్కొన్నారు.

# ఎమ్మెల్సీ కవిత సస్పెన్షన్

(మొదటి పేజీ తరువాయి)


ఈ మేరకు భారత రాష్ట్ర సమితి ప్రధాన కార్యదర్శులు సోమ భరత్‌కుమార్, టి.రవీందర్‌రావు పేరిట ఓ ప్రకటన విడుదల చేసింది. ఇటీవల కాలంలో కవిత ప్రవర్తిస్తున్న తీరు, కొనసాగిస్తున్న పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు భారత రాష్ట్ర సమితికి నష్టం కలిగించేలా ఉన్నాయి. అధిష్ఠానం ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణిస్తోంది. కవితను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ అధినేత కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారని భారత రాష్ట్ర సమితి పేర్కొంది. కవిత ప్రస్తుతం నిజామాబాద్ స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీగా ఉన్నారు. కొంతకాలంగా భారత రాష్ట్ర సమితితో విభేదిస్తున్న కవిత.. ఎక్కువగా తెలంగాణ జాగృతి తరఫున నిర్వహించే కార్యక్రమాలకే పరిమితమయ్యారు. కేసీఆర్ చుట్టూ దెయ్యాలున్నాయని.. తనపై కొందరు కుట్రలకు పాల్పడుతున్నారని ఇటీవల ఆరోపించారు. గతంలో పరోక్ష విమర్శలు చేసిన కవిత.. సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ ఎంపీ సంతోష్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. కేసీఆర్‌పై సీబీఐ విచారణ వరకు పరిస్థితి వచ్చాక.. పార్టీ ఉంటే ఎం? లేకపోతే ఎం? అని కవిత వ్యాఖ్యానించారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో పార్టీ విధానంతో ఆమె విభేదించారు. ఈ పరిణామాల నేపథ్యంలో కవితను పార్టీ సస్పెండ్ చేసింది. ఇకపోతే కేసీఆర్‌కు మరక అంటించడంలో మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ ఎంపీ సంతోష్‌ల అవినీతే ప్రధాన కారణమని.. ఇందులో ముఖ్యపాత్ర హరీశ్‌రావుదేనని కవిత తీవ్ర ఆరోపణలు చేశారు. వీరిద్దరి వెనుక ఉండి కుట్రలు చేస్తున్నది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని ఆరోపించారు. కేసీఆర్‌పై అభాండాలు వేయడం.. కాళేశ్వరం బూచి చూపి సీబీఐ విచారణకు ప్రయత్నించడం చూసి ఆవేదన కలుగుతోందన్నారు. అమెరికా పర్యటన ముగించుకొని సోమవారం ఉదయం హైదరాబాద్‌కు చేరుకున్న కవిత విలేకరుల సమావేశంలో సంచలన వ్యాఖ్యలు చేశారు. గతంలో అమెరికా పర్యటన అనంతరం.. కేసీఆర్ దేవుడని.. కానీ, ఆయన చుట్టూ దెయ్యాలున్నాయని పరోక్ష విమర్శలు చేసిన కవిత.. ఇప్పుడు నేరుగా హరీశ్‌రావు, సంతోష్‌లపై విరుచుకుపడ్డారు. కేసీఆర్‌కు మరక ఎలా అంటిందో గులాబీ శ్రేణులు ఆలోచించాలి? పక్కన ఉన్న వాళ్ల వల్లే ఆయనకు ఈ దుస్థితి వచ్చింది. అందువల్లే తెలంగాణ అంటే గిట్టని, పక్క రాష్ట్రం ఎజెండాను అమలుచేసే సీఎం రేవంత్‌రెడ్డి సైతం కేసీఆర్‌ను విమర్శించే పరిస్థితి వచ్చిందన్నారు. అవినీతికి పాల్పడిన హరీశ్, సంతోష్‌లు దగ్గరుండి మరీ కేసీఆర్‌ను బద్నాం చేయిస్తున్నారు. ఇందులో మేఘా కృష్ణారెడ్డి పాత్ర కూడా ఉంది. అవినీతి ఆరోపణలు ఉండడం వల్లే హరీశ్‌రావును రెండోసారి మంత్రివర్గంలోకి తీసుకోవడంలో జాప్యం చేశారు. అందుకే రెండోసారి నీటిపారుదల శాఖ కూడా ఇవ్వలేదు. నాపై వారిద్దరూ ఎన్ని కుట్రలు చేసినా భరించాను. కేసీఆర్‌పై ఈ వయసులో సీబీఐ విచారణ ఏంటి? ఆయన ఏనాడూ ఆస్తులు సంపాదించలేదు. నా వివాహం చేసేందుకు సైతం ఇబ్బంది పడ్డారు. దేవుడి లాంటి మా నాన్నపై సీబీఐ విచారణ అంటే బాధ కలుగుతోందంటూ వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలో ఆమె వ్యాఖ్యలపై కెసిఆర్ చర్చించాక ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలో ఆమె సొంత కుంపటి పెట్టుకోవడం ఖాయమని తెలుస్తోంది. ఇకపోతే నా వెనుక కాంగ్రెస్ ఉందని.. భాజపా ఉందని సామాజిక మాధ్యమాల్లో ట్రోల్ చేస్తున్నారు. నాది కేసీఆర్ రక్తం. నేను ఇండిపెండెంట్‌గానే ఉంటానని కూడా వ్యాఖ్యానించడంతో ఆమె అన్నింటికీ సిద్దమయ్యారని తెలుస్తోంది.

# వైఎస్ కలలుకన్న ప్రాణహిత చేపట్టి పూర్తి చేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. భవిష్యత్తులోనూ ఎవరూ రద్దు చేయలేని పథకాలను వైఎస్సార్ అమలు చేశారు. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలను రద్దు చేసే ధైర్యం ఎవరికీ లేదు. ఆయన స్ఫూర్తిని తమ ప్రభుత్వం కొనసాగిస్తోందన్నారు. హైదరాబాద్‌లోని హోటల్ దస్‌పల్లాలో నిర్వహించిన వైఎస్సార్ మెమోరియల్ అవార్డ్స్ కార్యక్రమంలో సీఎం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సుభాష్ పాలేకర్‌కు వైఎస్సార్ మెమోరియల్ అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. రైతుల విద్యుత్ బకాయిలు రద్దు చేయడంతో పాటు-, వారిపై కేసులు కొట్టివేసి వైఎస్సార్ గొప్ప నిర్ణయం తీసుకున్నారని కొనియాడారు. ఉచిత విద్యుత్ ఎవరు ఇచ్చినా ఆయన పేరే గుర్తుకు తెచ్చుకుంటారని చెప్పారు.

రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితి రూ.2లక్షలు ఉంటే రూ.10లక్షలు చేశాం. అధికారంలోకి వచ్చిన 3 నెలల్లోనే



రైతుల రుణమాఫీ అమలు చేశాం. కేంద్ర ప్రభుత్వం సహకారం లేకపోవడంతో రాష్ట్రంలోని రైతులకు యూరియా సమస్య వచ్చింది. సుభాష్ పాలేకర్ చెప్పినట్లు- సేంద్రియ వ్యవసాయం చేస్తే ఉపయోకరంగా ఉంటుంది. ఆ దిశగా రసాయన వ్యవసాయం నుంచి సేంద్రీయ వ్యవసాయం వైపు అడుగులు వేయాలని అన్నారు. వైఎస్సార్‌తో తనకున్న అనుబంధాన్ని, ఆయన పాలన స్ఫూర్తిని గుర్తుచేసుకున్నారు. స్నేహానికి, పాలనకు వైఎస్సార్ ఒక నిలువుటద్దమని, ఆయన ఆశయాలను తమ ప్రభుత్వం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. అధికారంలో ఉన్నప్పుడు చాలా మంది మిత్రులుగా మన చుట్టూ చేరతారు. కానీ అధికారం పోగానే ఆ మిత్రులు కూడా మాయమైపోతారు. అయితే, వైఎస్సార్-కేవీపీల స్నేహం అలాంటిది కాదు. విద్యార్థి దశ నుంచి వైఎస్సార్ మరణం వరకు కేవీపీ ఆయనకు తోడుగా నిలిచారు. ఇప్పటికీ వైఎస్సార్ ఆలోచనలనే కేవీపీ కొనసాగిస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. నేను సీఎం అయ్యాక వారానికి ఒకరిద్దరు నన్ను కలిసి, 'అన్నా, నేను మీకు కేవీపీలా పనిచేస్తా, అన్నీ నేనే చూసుకుంటా' అని చెబుతుంటారు. నేను వారికి ఒకటే చెప్పాను.. ఈ తరానికి వైఎస్ ఒక్కరే ఉంటారు.. కేవీపీ కూడా ఒక్కరే ఉంటారు. ఎవరూ కేవీపీ కాలేరు. అందుకు సర్వం వదులుకోవడానికి సిద్ధంగా ఉండాలి. వైఎస్సార్ సైతం తనపై వచ్చిన తప్పిదాలను తన ఖాతాలో వేసుకొని, జరిగిన మేలును కేవీపీ ఖాతాలో వేసే గొప్ప మనసున్న వ్యక్తి అని రేవంత్ రెడ్డి ఉద్వేగంగా ప్రసంగించారు.

# సుగాలి ప్రీతి కేసు దర్యాప్తు సీబీఐకి

(మొదటి పేజీ తరువాయి)

ప్రతిపక్షంలో ఉన్నప్పటి నుంచి పవన్ కల్యాణ్ ఈ కేసుకు సంబంధించి గళం విప్పుతున్న విషయం తెలిసిందే. అప్పట్లో ఆయన కర్నూలు వెళ్లి సుగాలి ప్రీతి కుటుంబాన్ని పరామర్శించి, వారికి న్యాయం జరిగే వరకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు.ఆనాడు పవన్ కల్యాణ్ ఒత్తిడితో గత వైసీపీ ప్రభుత్వం కేసు విచారణలో కొంత కదలిక తీసుకువచ్చినప్పటికీ, అప్పటికే కీలకమైన సాక్ష్యాధారాలు లేకుండా పోయాయని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో, కేసును నిష్పక్షపాతంగా విచారించాలంటే సీబీఐ జోక్యం అవసరమని ప్రస్తుత ప్రభుత్వం భావిస్తోంది. ఎల్లుండి జరగనున్న రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఈ అంశంపై చర్చించి, అధికారికంగా ఆమోదముద్ర వేసే అవకాశం ఉందని తెలుస్తోంది. మంత్రివర్గ ఆమోదం తర్వాత, కేసును సీబీఐకి బదిలీ చేసే ప్రక్రియను ప్రభుత్వం అధికారికంగా ప్రారంభించనుంది.

### వినాయకుని ఆశీర్వాదం ఉంటే

# సకల కార్యాలూ సిద్ధిస్తాయి

**ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి**

**షాద్ నగర్ మున్సిపాలిటీ 11వ వార్డులో వినాయక పూజ,అన్న ప్రసాద కార్యక్రమం**

**పాల్గొన్న ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి**

**హాజరైన మాజీ మున్సిపల్ కౌన్సిలర్ లు,నాయకులు**





**ప్రజావినికిడి,(షాద్ నగర్):** వినాయకుని ఆశీర్వాదం ఉంటే సకల కార్యాలు సిద్ధిస్తాయన్నారు ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి.షాద్ నగర్ పట్టణంలోని 11 వ వార్డులో వినాయక పూజ,అన్న ప్రసాద కార్యక్రమాలలో పాల్గొన్నారు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి.ఈ సందర్భంగా వినాయక మండపం వద్ద కులమతలకు అతీతంగా పట్టణానికి చెందిన రియల్టర్ ఎండి. యూసుఫోద్దీన్ భక్తులకు అన్నప్రసాదం చేశారు.ఈకార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు, నాయకులు పిల్లి శేఖర్,జూపల్లి శంకర్,మైనారిటీ నాయకులు ఏజాజ్ (అడ్డు),దాస ఆంజనేయ స్వామి గణేష్ మండల్,చిపిరి రవి,ఆకుల శ్రీను యాదగిరి,బిక్షపతి, మంగలి నర్సింహా,మేడంపల్లి రాములు,గోపాల్,చెర్కా శివ,యాదగిరి,శేఖర్,నరేందర్ గౌడ్,జడేలా శ్రీను,దుర్గం విజయ్ కుమార్,శ్రీకాంత్,అనిల్,భూషం లింగం,ఉమాపతి, యువనాయకులు తదితరులు పాల్గొన్నారు.

### నువ్వుల బండలోని సిద్ధి వినాయక వెల్ఫేర్ అసోసియేషన్

## ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం





**ప్రజావినికిడి,(నాగోల్):** ఎల్బీనగర్ నియోజకవర్గంనాగోల్ డివిజన్ పరిధి నువ్వుల బండలోని సిద్ధి వినాయక వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్టించిన వినాయకుడికి ఏడవ రోజు ఘనంగా పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం ఎంతో కనుల పండుగగా చేశారు.ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ,ప్రతి సంవత్సరం ఇదే విధంగా వినాయకుడిని ప్రతిష్టించి ఘనంగా అన్నదాన కార్యక్రమం చేస్తామని అన్నారు. కాలనీవాసులందరూ ఐక్యమత్యంగా ఈ వేడుకను ఘనంగా నిర్వహించుకుంటామని పేర్కొన్నారు. దాదాపుగా అన్నదాన కార్యక్రమంలో 500 మందికి పైగా పాల్గొన్నట్లు తెలిపారు. ఆ వినాయకుడి దయ వల్ల ప్రజలందరూ బాగుండాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంజయ్య, జయసింహా,విశాల్, అనిల్,శంకర్, సంతోష్,నిరంజన్, శశి,సాగర్,సుధాకర్, మణికంఠ,మంగ, భవాని భవాని,రమ, ఆమని,శాలిని,పప్పీ, నీలిమ,వనజ, మమత,మమత, స్వరూప,పెద్దలు పిల్లలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

### యంగ్ మాన్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో

### వినాయక చవితి సందర్భంగా అన్నదాన కార్యక్రమం



**ప్రజావినికిడి,(కొత్తపేట):**కొత్తపేట డివిజన్ పరిధి ఎస్ ఆర్ ఎల్ కాలనీలోని యంగ్ మాన్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెలకొల్పిన వినాయకుడికి ఘనంగా పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం ఎంతో ఘనంగా నిర్వహించారు.ఈ అన్నదాన కార్యక్రమానికి ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్,వివిధ పార్టీల నాయకులు, ప్రముఖులు పాల్గొని గణనాథుని దర్శించుకున్నారు. అనంతరం అసోసియేషన్ సభ్యులు వారిని సన్మానించారు.ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ గత 18 ఏళ్ల నుండి ఇక్కడ గణేశుడుని ప్రతిష్టించి పూజలు నిర్వహిస్తున్నామని తెలిపారు.ఈ గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పూజలు, హెూమాలు,దాండియా, భజనలు,ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమాలు ఎంతో వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ప్రతి ఏటా నిర్వహించే అన్నదాన కార్యక్రమంలో దాదాపుగా 2500 మందికి పైగా కాలనీవాసులు, భక్తులు పాల్గొంటారని పేర్కొన్నారు.ఆ వినాయకుడి దయవల్ల అందరు బాగుండాలని కోరారు.ఈ కార్యక్రమంలో తోట మధు యాదవ్, శైలేందర్,హరీష్, కార్తీక్,నితిన్ అభిలాష్,విక్కీ, సంతోష్,తదితర అసోసియేషన్ సభ్యులు,మహిళలు, పిల్లలు,పెద్దలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# గుండ్రంపల్లి అమర వీరులకు ఘనముగా

## నివాళి అర్పించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు


**17వ తెలంగాణ విమోచన దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి..**

**-ఎన్. రామచందర్ రావు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు**

**ప్రజావినికిడి, (యాదాద్రి):**గుండ్రంపల్లి అమర వీరుల స్మారకస్థలంలో మంగళవారం ఘనంగా శ్రద్ధాంజలి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమం సి.అంజిరెడ్డి ఎమ్మెల్సీ, విమోచన కమిటీ ఛైర్మన్ ఆధ్వర్యంలో, డా.వర్షిత్ రెడ్డి జిల్లా అధ్యక్షతన జరిగింది.ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు మాట్లాడుతూ,అమర వీరుల త్యాగం వల్లనే తెలంగాణ ప్రజలకు ఆత్మగౌరవం, స్వాభిమాన జీవనం లభించింది.వారి స్ఫూర్తి లేకపోతే తెలంగాణ సాధ్యం అయ్యేది కాదు.ప్రతి తరానికి అమరుల త్యాగం ఒక దీపస్తంభంలా మార్గదర్శకంగా నిలుస్తుంది.అమరుల కలలను సాకారం చేయడమే నిజమైన నివాళి అని పేర్కొన్నారు.ఈ సందర్భంగా సి. అంజిరెడ్డి ఎంఎల్ సి మాట్లాడుతూ,"గుండ్రంపల్లి అమరులు నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రాణత్యాగం చేసి చరిత్ర సృష్టించారు.తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించడం రాష్ట్ర ప్రభుత్వపు బాధ్యత అమరుల త్యాగం వృధా కాకుండా యువతకు స్ఫూర్తిగా నిలవాలని అందరం కృషి చేయాలి."అని అన్నారు.ఈ సందర్భంగా నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ,"గుండ్రంపల్లి అమరులు తెలంగాణ విమోచనకు బలిదానం చేశారు.వారి రక్తం వల్లనే ఈ నేలపై స్వేచ్ఛా గాలి వీసింది. నేడు తెలంగాణలో



స్వాభిమానం, ప్రజాస్వామ్యం మన ముందున్నది అమరుల త్యాగ ఫలితం.ఈ రోజు అధికారంలో ఉన్న ప్రభుత్వం అమరులను విస్మరిస్తూ అధికారికంగా విమోచన దినోత్సవాన్ని నిర్వహించకపోవడం దురదృష్టకరం.బీజేపీ మాత్రం ప్రతి సంవత్సరం ఘనంగా అమరులను స్మరించుకుంటూ,వారి కలల తెలంగాణ కోసం కట్టుబడి పనిచేస్తుంది."అని బలంగా తెలిపారు.కార్యక్రమంలో బూర నర్సయ్యగౌడ్,సైది రెడ్డి,కాశం వెంకటేశ్వర్లు,మనోహర్ రెడ్డి,పాతూర్ కరుణ, విక్రమ్ రెడ్డి,మధుసూదన్ రెడ్డి, దివాకర్,డా.వర్షిత్ రెడ్డి,శ్రీధర్,మహేందర్ తదితర పెద్ద ఎత్తున బీజేపీ పార్టీ నాయకులు, తెలంగాణ అభిమానులు



పాల్గొన్నారు.నాయకులు అందరూ కలిసి అమరుల స్మారక స్థూపం వద్ద పూలమాలలు వేసి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు.అనంతరం అమరవీరుల కుటుంబ సభ్యులను సన్మానించారు.

## ఈ నెల 8న షాద్ నగర్ లో వికలాంగులు

# చేయూత పెన్షన్ దారుల మహాసభ

**అనేక అంశాలపై మాట్లాడుతున్న ముఖ్యమంత్రికి పెన్షన్లు ఇవ్వడానికి చేతులు రావడం లేదా.?**

**ఈ నెల ఓటు వేయండి,వచ్చే నెల పెరిగే పెన్షన్ తీసుకొండని మాట్లాడిన రేవంత్ రెడ్డి యాదికోస్తలేదా**

**పెన్షన్ ఇస్తా అన్నోల్లు ఇవ్వరు అడగాల్సినోళ్లు అడగరు -రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్లు పెంచాలి**

**ఎమ్మార్పీఎస్ ప్రధాన కార్యదర్శి రాగళ్ల ఉపేందర్ మాదిగ**

**ప్రజావినికిడి,(షాద్ నగర్):**
వికలాంగుల పెన్షన్ రూ 6 వేలకు మరియు వృద్దులు, వితంతువులు,ఒంటరి మహిళలు,అన్ని రకాల చేయూత పెన్షన్లు రూ 4 వేలకు పెంచాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఉద్యమంలో భాగంగా ఈ నెల 8వ తేదీన షాద్ నగర్ నియోజకవర్గ కేంద్రంలో చేయూత పెన్షన్ దారుల మహాసభను నిర్వహిస్తున్నామని ముఖ్య అతిథిగా పెన్షన్ దారుల ఆశాజ్యోతి పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా పాల్గొంటారని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా ఇంచార్జి రాగళ్ల ఉపేందర్ మాదిగ అన్నారు.షాద్ నగర్ నియోజకవర్గ కేంద్రంలోని స్థానిక దేవి గ్రాండ్ మినీ కాన్ఫరెన్స్ హాల్ లో నియోజక వర్గ ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి, ముఖ్య కార్యకర్తల సమావేశం ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు పెంటనోళ్ళ నరసింహ మాదిగ అధ్యక్షతన జరిగింది.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాగల్ల ఉపేందర్ మాదిగ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వికలాంగుల పెన్షన్ రూ 6 వేలకు పెంచి ఇస్తున్నాడు.కానీ తెలంగాణలో రూ 6 వేలు ఇస్తానని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వికలాంగులను మోసం చేశాడని అన్నారు.2023 ఎన్నికల సమయంలో వికలాంగుల పెన్షన్ 6 వేలు,మిగితా చేయూత పెన్షన్ దారుల పెన్షన్ రూ 4 వేలకు పెంచుతామని రేవంత్ రెడ్డి బహిరంగంగా హామీ ఇచ్చారు.ఈ నెల ఓటు వేయండి,వచ్చే నెల పెరిగే పెన్షన్ తీసుకొండని మాట్లాడిన రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి పదవి చేపట్టి 20 నెలలు దాటినా ఒక్క రూపాయి కూడా



పెంచలేదని అన్నారు.ఇది ఘోరమైన మోసం అని అన్నారు.ఈ మోసం గురించి ప్రతిపక్షాలు కూడా మాట్లాడకుండా చేయూత పెన్షన్ దారులకు అన్యాయం చేస్తున్నాయని అన్నారు. అనేక అంశాలపై మాట్లాడుతున్న ముఖ్యమంత్రికి పెన్షన్లు ఇవ్వడానికి చేతులు రావడం లేదా..? అని ప్రశ్నించారు.కాళ్లు లేనోళ్లు,చేతులు లేనోళు ,,వయసు మీద పడ్డ ముసలోళ్ళు, పేదవర్గాలను నమ్మించి ఈ నెల ఓటు వేయండి,వచ్చే నెల పెరిగే పెన్షన్ తీసుకొండని మాట్లాడిన రేవంత్ రెడ్డి గారు నేడు గద్దెనెక్కి 20 నెలలు గడుస్తున్న మీరు మాట్లాడిన మాటలు యాదికొస్తలేవా అని మండిపడ్డారు.పెన్షన్ ఇస్తా అన్నోల్లు ఇవ్వరు. అడగాల్సినోళ్లు అడగరు.పార్టీలు కూడా వాళ్ళ వర్గ ప్రయోజనాల రిత్యానే ఆలోచిస్తున్నాయి తప్ప పేదలను గాలికి వదిలేస్తున్నాయని గుర్తు చేశారు.కాబట్టే 50 లక్షల మంది పెన్షన్ దారుల పక్షాన మంద కృష్ణ మాదిగ పోరాటానికి శ్రీకారం చుట్టారని అన్నారు.అందులో భాగంగా తెలంగాణ నలుమూల తిరుగుతూ 8వ తేదీన షాద్ నగర్ కు వస్తున్నారని అన్నారు. షాద్ నగర్ నియోజక వర్గ పరిధిలో ఉన్న అన్ని రకాల చేయూత పెన్షన్ దారులు మహాసభకు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. పెన్షన్ దారుల శక్తి ఏందో ప్రభుత్వానికి చూపించడం కోసమే చేయుత పెన్షన్ దారుల గర్జన మహాసభ పెరేడ్ గ్రౌండ్లో లక్షలాదిమందితో నిర్వహిస్తున్నామని దానికి సన్నద్ధం కావాలని అందుకోసం నాయకులందరూ గ్రామాలకు వెళ్లి పెన్షన్ దారులని ఏకం చేసి 8వ తారీకు సభకు తరలించాలని కోరారు.ఈ కార్యక్రమంలో చిన్నోళ్ల అనంతయ్య మాదిగ,బుర్ర రామచంద్రయ్య మాదిగ,పెంటనోళ్ళ రవి కుమార్ అన్నెగాళ్ల ఆనంద్ మాదిగ,చన్నగళ్ళ అశోక్ మాదిగ,కల్లేపల్లి బాలరాజ్ మాదిగ
జోగు నాగ భూషణ్ మాదిగ,బొబ్బిలి పాండు మాదిగ, గూడెం జంగయ్య మాదిగ,జెనిగే శ్రీశైలం మాదిగ,శివకుమార్ మాదిగ,ఇటిక్యాల రాజు మాదిగ పద్మారం యాదయ్య మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

# మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి

**ఆయన ఆశయాలను కొనసాగిద్దాం..**

**ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్..**

**వైయస్సార్ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ నేత ఎండి ఇబ్రహీం ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు..**

**నివాళులర్పించిన పలువురు కాంగ్రెస్ నేతలు..**

**ప్రజావినికిడి,(షాద్ నగర్):**
సూర్యచంద్రులు ఉన్నంతకాలం,బడుగు బలహీన వర్గాల ప్రజల మనసుల్లో నిరంతరం నిలిచిపోయే మహానేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి అని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దివంగత కాంగ్రెస్ నీతో డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 16వ వర్ధంతి సందర్భాన్ని పురస్కరించుకొని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎండి ఇబ్రహీం ఆధ్వర్యంలో
షాద్ నగర్ పట్టణ ముఖ్య కూడలిలో గల వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్,వైయస్ రాజశేఖర్





రెడ్డి మహెూన్నతమైన ఆశయాలు కలిగిన వ్యక్తిగా నిరంతరం బడుగు బలహీన వర్గాల సంక్షేమమే పరమావధిగా,ఒక రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నత భావాలతో రాష్ట్రాన్ని నడిపించాడని ఆయన ఆశయాలకు అనుగుణంగానే మనమందరం నడుచుకోవాలని, ఆయన అడుగుజాడల్లోనే మనమందరం పయనించాలని అన్నారు.డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి కి నివాళులు అర్పించిన వారిలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్,పట్టణ అధ్యక్షుడు కొంకళ్ళ చెన్నయ్య,ఎండి ఇబ్రహీం,చెంది తిరుపతి రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్,మసూద్ అలీ ఖాన్,దంగు శ్రీనివాస్ యాదవ్,అప్పి, రవికుమార్,సర్వర్ పాషా,జమ్రుద్ ఖాన్ లతో పాటు పలువురు కాంగ్రెస్ సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి చేతుల మీదుగా పేదవారి సొంతింటి కల నెరవేరనుంది..

**గిరిజన ప్రాంతమైన బెండలపాడు చారిత్రక ఘట్టం.. పండుగ వాతావరణంలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు..**
**రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి..**




**ప్రజావినికిడి,(హైదరాబాద్):**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం బెండలపాడు గ్రామంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చేతుల మీదుగా పేదవారి సొంతింటి కల నెరవేరబోతుందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.మంగళవారం బెడాలపాడు గ్రామంలో జరగబోయే ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాల ఏర్పాట్లను గృహనిర్మాణ శాఖ ఎండి వి.పి.గౌతమ్, జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్,జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, అశ్వరావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ, భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు,ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్యతో కలిసి మంత్రి పరిశీలించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మారుమూల గిరిజన ప్రాంతమైన బెండలపాడు గ్రామానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రావడం ఒక చారిత్రక ఘట్టం. ఇది గ్రామ ప్రజలకు సంతోషకరమైన మరియు గుర్తుండిపోయే రోజు అవుతుంది. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం కావడానికి జిల్లా యంత్రాంగంలోని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో, బాధ్యతాయుతంగా పనిచేయాలి అని సూచించారు.మంత్రి అధికారులు గృహప్రవేశ వేడుకలను పండుగ వాతావరణంలో, అంగరంగ వైభవంగా నిర్వహించాలన్నారు. సభా ప్రాంగణాన్ని పరిశీలించిన అనంతరం,గ్రామాన్ని అందంగా తీర్చిదిద్దడంలో ఎలాంటి లోటు లేకుండా పనులు పూర్తి చేయాలని సూచించారు.ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలపై మాట్లాడుతూ, మంత్రి తెలిపారు.మా ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి గృహనిర్మాణ శాఖను బలోపేతం చేస్తూ, పేదవారికి న్యాయం జరిగేలా పారదర్శక విధానంలో ఇళ్లను మంజూరు చేస్తున్నాం. లబ్ధిదారుల ఎంపిక నుండి వారి ఖాతాల్లో నిధుల జమ వరకు మొత్తం ప్రక్రియలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తున్నాం. ఎక్కడైనా అవకతవకలు జరిగినా వాటిని వెంటనే గుర్తించి,సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటివరకు కొందరిని సస్పెండ్ చేయడం, కేసులను ఏసీబీకి అప్పగించడం కూడా జరిగింది అని అన్నారు.ఇందిరమ్మ ప్రభుత్వానికి ఓటు వేసిన వారికే కాకుండా, రాజకీయాలు,కులం, మతం అనే తేడా లేకుండా ప్రతి పేదవానికి సొంతింటి కల నెరవేరేలా చర్యలు తీసుకుంటున్నాం.
ఈ పథకం వల్ల జిల్లాలోనే సుమారు 21,500 కుటుంబాల లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి గృహప్రవేశాల సందర్భంగా లబ్ధిదారులను ప్రత్యక్షంగా ఉద్దేశించి మాట్లాడి,వారి సంతోషంలో పాలుపంచుకుంటారు అని మంత్రి పేర్కొన్నారు.గత ప్రభుత్వం గృహనిర్మాణ శాఖను నిర్వీర్యం చేసి, పేదవారి కలలను దెబ్బతీసింది.కానీ మా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గృహనిర్మాణ శాఖను తిరిగి బలోపేతం చేసి, లక్షలాది పేదలకు గృహాల కలను నిజం చేసేందుకు కృషి చేస్తున్నాం అన్నారు.ఈ మహత్తర గృహప్రవేశ కార్యక్రమానికి జిల్లా మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు, ఇంచార్జ్ మంత్రి వాకాటి శ్రీహరి,ఇతర సహచర మంత్రులు, శాసనసభ్యులు పాల్గొంటారని మంత్రి తెలిపారు.ఈ పరిశీలనలో టీజీ ఐడిసి చైర్మన్ మువ్వ విజయ్ బాబు,ట్రైనీ కలెక్టర్ సౌరబ్ శర్మ, జడ్పీ సీఈఓ నాగలక్ష్మి, కొత్తగూడెం ఆర్డీవో మధు జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జనం కోసం ఏర్పాటుచేసిన బేబీ పాండ్ ను పరిశీలించిన కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి..






**ప్రజావినికిడి,(ఎల్బీనగర్):** బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని సచివాలయ నగర్ లో వినాయక నిమజ్జనం కోసం ఏర్పాటుచేసిన బేబీ పాండ్ ను బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ విభాగం ఈ ఈ రమేష్ బాబుతో కలిసి పరిశీలించడం జరిగింది.ఈ సందర్భంగాకార్పొరేటర్ మాట్లాడుతూ,ఈ బేబీ పాండ్ మూడు అడుగుల లోపు ఉన్న విగ్రహాలను నిమజ్జనం చేయుటకు ప్రత్యేకంగా ఏర్పాటు చేయడం జరిగిందని ఇట్టి పౌండ్ను ప్రజలందరూ వినియోగించుకోవాలని కోరారు మరియు నిమజ్జనం కోసం వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు తెలియజేయడం జరిగింది.
ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ విభాగం డి ఈ దామోదర్ రావు, ఏ ఈ కార్తీక్, జిహెచ్ఎంసి శానిటేషన్ విభాగం ఎస్ ఎస్ అజీమ్ ఉద్దీన్ జవాన్ యాదయ్య, సచివాలయ నగర్ కాలనీ అధ్యక్షులు సాంబశివరావు,ప్రధాన కార్యదర్శి బాల్ రెడ్డి, ఉపాధ్యక్షులు గోపాల్ రెడ్డి, ఆంజనేయులు, ఆర్గనైజింగ్ సెక్రటరీ సూర్యనారాయణ, కల్చరల్ సెక్రటరీ హరీష్,ట్రెజరర్ రవికుమార్,స్పోర్ట్స్ సెక్రటరీ శ్రీధర్ కుమార్ మరియు కాలనీ కార్యవర్గ సభ్యులు తదితరులు ఉన్నారు.

# మహిళా మణులకు మాట ఇచ్చా..
# నేడు ఆ మాట నెరవేర్చుకుంటున్న..

**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ - 7వ వార్డులో రేషన్ దుకాణాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే..**
**హర్షం వ్యక్తం చేస్తున్న మహిళామణులు.. - హాజరైన కాంగ్రెస్ నేతలు,కాలనీ వాసులు..**

**ప్రజావినికిడి,(షాద్ నగర్):**
మహిళా మణులకు మాటిచ్చా.. రేషన్ పరేషాన్ తీరుస్తానని..నేడు ఆ మాట నెరవేర్చుకుంటున్నానని,వారి అభీష్టం మేరకు పట్టణంలోని 7వ వార్డులో నూతన రేషన్ దుకాణాన్ని అందజేయడం జరిగిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు.షాద్ నగర్ పట్టణ పరిధిలోని 7వ వార్డులోని న్యూ భాగ్యనగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన రేషన్ దుకాణాన్ని మంగళవారం ఉదయం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా కాలనీలోని మహిళలకు రేషన్ బియ్యం అందజేశారు. అంతకముందు కాలనీకి విచ్చేసిన ఎమ్మెల్యే కు స్థానిక కాంగ్రెస్ పార్టీ వార్డు ఇంచార్జ్ కొప్పునూరి ప్రవీణ్ ఆధ్వర్యంలో మహిళలు,కాలనీ వాసులు శాలువాలతో సత్కరించి,ఘన స్వాగతం పలికారు.అనంతరం ఎమ్మెల్యే స్థానిక మీడియాతో మాట్లాడుతూ,వార్డుల అభివృద్ధి లక్ష్యంగా ఏడవ వార్డులో పర్యటించిన నాకు స్థానిక మహిళలు ఎదుర్కొంటున్న రేషన్ కష్టాలను వివరించారని,వారి కష్టాలను తీరుస్తానని మాట ఇచ్చానని,
ఆ మాటను నేడు నెరవేర్చుకుంటూ రేషన్ దుకాణాన్ని అందజేయడం జరిగిందని ఆయన మీడియాకు వివరించారు.గత పది ఏళ్లలో గత ప్రభుత్వం అభివృద్ధిని విస్మరించిందన్నారు. ప్రజలు తీవ్ర అవస్థలు తీర్చడం ప్రజా ప్రతినిధిగా నా బాధ్యత అని,ప్రజల సమస్యలను తీర్చడంలోనే నిజమైన ఆనందం ఉందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో సైతం సమస్యలను తీర్చడంలో ముందుంటానని, కాలనీలోని అవసరాలను మీ వార్డు అభివృద్ధికి కృషి చేస్తున్న కొప్పునూరి ప్రవీణ్ ద్వారా తెలియజేయొచ్చు అని ఆయన మహిళలకు సూచించారు.వార్డు అభివృద్ధికి సుమారు
4 కోట్ల నిధులు మంజూరు చేయడం జరిగిందని,మరింత అభివృద్ధి కి మరిన్ని నిధులు మంజూరు చేయడానికి కృషి చేస్తానని ఆయన ప్రజలకు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్,సీనియర్ నేతలు కృష్ణారెడ్డి,మున్సిపల్ మాజీ చైర్మన్ అగునూరు విశ్వం,చెంది తిరుపతిరెడ్డి,పట్టణ అధ్యక్షులు కొంకళ్ల చెన్నయ్య,కర్ణాకర్, సుదర్శన్,కాలనీవాసులు మంచిరేవుల అశోక్,కుమ్మరి శ్రీశైలం,కాంతయ్య, దాసరి నరేష్, విభూతి,వినోద్,డీసీఎం రాజు,మహిళలు తదితరులు పాల్గొన్నారు.

### స్నేహపురి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో
## వినాయక చవితి సందర్భంగా అన్నదాన కార్యక్రమం



**ప్రజావినికిడి,(కొత్తపేట):** కొత్తపేట డివిజన్ పరిధి స్నేహపురి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెలకొల్పిన వినాయకుడికి ఘనంగా పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం ఎంతో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ,గత 20 ఏళ్ల నుండి ఇక్కడ గణేశుడుని ప్రతిష్టించి పూజలు నిర్వహిస్తున్నామని తెలిపారు.ఈ గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పూజలు, హెూమాలు,దాండియా, భజనలు,ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమాలు ఎంతో వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ప్రతి ఏటా నిర్వహించే అన్నదాన కార్యక్రమంలో దాదాపుగా 3000 మందికి పైగా కాలనీవాసులు, భక్తులు పాల్గొంటారని పేర్కొన్నారు.ఆ వినాయకుడి దయవల్ల అందరు బాగుండాలని కోరారు.తమకు అన్ని విధాలుగా సహకరిస్తున్న దాతలకు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కిషోర్ రెడ్డి,లక్ష్మారెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, దయాకర్ రెడ్డి,తదితర అసోసియేషన్ సభ్యులు,మహిళలు, పిల్లలు,కాలనీ పెద్దలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## లష్కేర్ గూడ గ్రామంలో మునికుంట్ల శ్రీధర్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా వైఎస్సార్ వర్ధంతి వేడుకలు



**ప్రజావినికిడి,(అబ్దుల్లాపూర్మెట్)** అబ్దుల్లాపూర్మెట్లష్కర్ గూడ గ్రామం అబ్దుల్లాపూర్మెట్ మండలంలో ఘనంగా వైఎస్సార్ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వైయస్సార్ అభిమానులు పాల్గొని వైయస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు ఆయన చేసిన సేవలు మరువలేవని ప్రజల గుండెల్లో ఎప్పుడు ఉండిపోతాడని వైయస్సార్ వర్ధంతి ఘనంగా జరుపుకుంటామని లష్కర్ గూడ గ్రామ అభిమానులు తెలిపారు.

## వెంకటేశ్వర కాలనీ లోనీ గణనాధుడికి ఏసిపి కృష్ణయ్య ప్రత్యేక పూజలు..



**ప్రజావినికిడి,(హైదరాబాద్):** గణనాధుడి ఆశీస్సులు అందరిపై ఉండాలని ఎల్బీనగర్ డివిజన్ ఏసిపిఎ.కృష్ణయ్య అన్నారు. మంగళవారం నరూర్ నగర్ డివిజన్ వెంకటేశ్వరకా లనీ రోడ్డు నంబర్ 5లో ప్రముఖవ్యాపారవేత్త సోమ వెంకట్ ఆధ్వర్యంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.ఈవేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమానికి ఏసిపి ఎ.కృష్ణయ్య ముఖ్య అతిథిగా హాజరైప్రత్యేక పూజలు చేశారు.అనంతరం గాయత్రి కూచిపుడి అకాడమి వారు నిర్వహించిన పలు సాంస్కృతికకార్యక్రమాలను తిలకించి విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు.ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ,శాంతి భద్రత పరిరక్షణలో ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు. భక్తులందరూ భక్తిశ్రద్ధతో స్వామి వారికి పూజించాలన్నారు. మండల నిర్వాహకులు ఎసిపి కృష్ణయ్యను శాలువాతో ఘనంగాసన్మానించారు.ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు తులసీ కృష్ణమూర్తి, రాజనాల వెంకటేశ్వర్ రావు, గంటిశంకర్,గుంత ప్రవీణ్, గంటి వెంకట్ రావు, గంటి శంకర్,కె.బుద్ధోజి చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## చంపపేట్ రెడ్డి కాలనీలో గణపయ్యకు విశేష పూజలు.




**ప్రజావినికిడి,(చెంపపేట్):**
యువ జై భవాని యూత్ ఆధ్వర్యంలో గణపతి పూజలు చంపపేట్ రెడ్డి కాలనీలోయువ జై భవాని యూత్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసిన మండపంలో ఘనంగా పూజలు చేశారు. అనంతరం,కృష్ణ గౌడ్ (కిట్టు) హనిమి రెడ్డి,ముఖ్యాతిథిగా మొదగోని లక్ష్మి ప్రసన్న గౌడ్,కాలనీ ప్రెసిడెంట్ మోహన్ రెడ్డి,కాంగ్రెస్ సీనియర్ నేత రవీందర్ గౌడ్,అన్నదాత కీర్తిశేషులు నర్సింగరావు,కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సీ.ఎం.రిలీఫ్ ఫండ్ తో ఎంతో మంది పేదలకు లబ్ది..

### ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి..

**ప్రజావినికిడి,(ఎల్బీనగర్):**
హస్తినపురం డివిజన్ పరిధిలోని నందనవనం నందు నివాసం ఉండే రమేష్ కీళ్లనొప్పులకు సంబంధించిన పలు సమస్యలతో బాధపడుతున్న నేపథ్యంలో అయితే వారి యొక్క ఆర్థికస్థితులు బాగలేక వారు వారి యొక్క కుటుంబసభ్యులు ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుదీర్ రెడ్డిని సంప్రదించారు.వెంటనే స్పందించిన సుదీర్ రెడ్డి అట్టి ఆపరేషన్ కు కావలసిన డబ్బుల వివరాలను ముఖ్యమంత్రి సహాయనిదికి దరఖాస్తు చేయడం జరిగింది.దానికి గాను వారికి 2,00,000(రెండు లక్షల రూపాయలు) ఎల్.ఓ.సీ.చెక్కు మంజూరు కావడం జరిగింది.ఈ సందర్భంగా సుదీర్ రెడ్డి మాట్లాడుతూ, పేదల ఆరోగ్య పరిరక్షణకు సీ.యం.సహాయనిధి దోహదపడుతుంది అని అన్నారు.ఈ పథకం పేదలకు ఓ వరం లాంటిది అని అన్నారు.పేద ప్రజలకు నాణ్యమైన అధునాతన వైద్య సేవలను పొందేందుకు సీ.ఎం.సహాయనిది అండగా ఉంటుంది అని అన్నారు.ఈ కార్యక్రమంలో కర్మన్ ఘాట్ హనుమాన్ దేవాలయం మాజీ ధర్మకర్త ఛాతిరి మధుసాగర్ పాల్గొన్నారు.


బాధితుడు రమేష్ కు 2,00,000 రూపాయల ఎల్.ఓ.సీ.అందజేస్తున్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి

## పలు వినాయక మండపాలలో పూజ ,అన్నప్రసాద కార్యక్రమాలు

### పాల్గొన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి..



**ప్రజావినికిడి,(షాద్ నగర్):**
విగ్నేశ్వరుని నామస్మరణతో విజయం సిద్ధిస్తుందన్నారు ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి.షాద్ నగర్ పట్టణంలోని పలు కాలనీలలో కొత్తూరు తండా వినాయక మండపాలలో పూజా అలాగే అన్న ప్రసాద కార్యక్రమాలలో పాల్గొన్నారు.ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి.ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ మాజీ వైస్ చైర్మన్ పాండురంగ రెడ్డి,మాజీ కౌన్సిలర్స్ పిల్లి శారదా శేఖర్,జూపల్లి కౌసల్య శంకర్,శ్రీనివాస్ గౌడ్,మానస యాదగిరి,పాలమకుల చెన్నయ్య,కొత్తూరు కౌన్సిలర్ సోమ్లా నాయక్,మాదారం నర్సిములు గౌడ్, నాయకులు రఘునాథ యాదవ్,ఆలుగడ్డ ప్రవీణ్ యాదవ్,చీపిరి రవి యాదవ్,అల్లాడ శేఖర్,నందారం అశోక్,ఉడుత శ్రీను,బిక్షపతి,మురళి యాదవ్,దినేష్ సాగర్,శివ చారి చెరుకు శివ,పాండు,పిల్లి సాయి,రవి,రామ్ నగర్ లడ్డు,గోపాల్ గౌడ్,వెంకటేష్,రాము, సాయి,శివ,రవి నాయక్,అంజి నాయక్,గుట్ట రాజు,అన్వారీ రాజు,రాజు ముదిరాజ్,చరణ్ తదితరులు పాల్గొన్నారు.



## ఎన్డీఎస్ఏ నివేదిక ఆధారంగా సీబీఐ విచారణ

### తెలంగాణ ప్రభుత్వం సిఫారసు



హైదరాబాద్, **సెప్టెంబర్2 ప్రజావినికిడి:** :కాళేశ్వరంపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఎన్డీఎస్ఏ నివేదిక ఆధారంగా సీబీఐ విచారణకు తెలంగాణ ప్రభుత్వం సిఫారసు చేసింది. ఈ మేరకు కేంద్ర హోంశాఖకు రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాసింది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో లోపాలు ఉన్నట్లు- ఎన్డీఎస్ఏ గుర్తించిందని.. ప్రణాళిక, డిజైన్, నాణ్యత, నిర్మాణంలో లోపాలు ఉన్నాయని ప్రభుత్వం పేర్కొంది. అందుకే ఈ అంశంపై సీబీఐతో విచారణ జరిపించాలని కోరింది. జస్టిస్ పీసీ ఘోష్ కమిటీ- కూడా విచారణ జరిపి లోపాలను గుర్తించిందని తెలిపింది. ఎన్డీఎస్ఏ నివేదికపై అసెంబ్లీలో చర్చించామని లేఖలో ప్రభుత్వం ప్రస్తావించింది. మరోవైపు రాష్ట్రానికి సీబీఐ రాకుండా గతంలో ఉన్న ఆదేశాలను సడలిస్తూ జీవో విడుదల చేసింది. సీబీఐ విచారణకు అన్నివిధాలుగా సహకరిస్తామని ప్రభుత్వం పేర్కొంది.

## జూబ్లీహిల్ ఓటర్ల ముసాయిదా జాబితా విడుదల

హైదరాబాద్, **సెప్టెంబర్2 ప్రజావినికిడి:**జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఉప ఎన్నికల సన్నాహకాలు మొదలయ్యాయి. ఇటీవల ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ మరణంతో ఆ నియోజకవర్గానికి ఉప ఎన్నికలు తప్పనిసరి అయ్యాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఓటర్ల ముసాయిదా జాబితాను విడుదల చేసింది. మొత్తం 3,92,669 మంది ఓటర్లు ఈ జాబితాలో ఉన్నారని అధికారులు వెల్లడించారు. ఇందులో పురుష ఓటర్లు 2,04,288 మంది, మహిళా ఓటర్లు 1,88,356 మంది కాగా, మూడవ లింగానికి చెందిన వారు 25 మంది ఉన్నారు. ఈ నియోజకవర్గంలో 139 లొకేషన్లలో 407 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు- చేసినట్లు- సమాచారం. ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు, మార్పులు, చేర్పులు, కొత్త ఓటర్ల నమోదు కోసం సెప్టెంబర్ 17 వరకు అవకాశం కల్పించారు. సెప్టెంబర్ 25లోపు ఫిర్యాదులు, అర్జీల పరిష్కారం పూర్తిచేయనున్నారు. అనంతరం సెప్టెంబర్ 30, 2025న తుది ఓటర్ల జాబితాను విడుదల చేయనున్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల దృష్ట్యా ఈ ఓటర్ల జాబితా అత్యంత కీలకంగా భావిస్తున్నారు.

## షాద్ నగర్ లో సీఎం రేవంత్ రెడ్డి

# దిష్టిబొమ్మ దహనం..

**కాళేశ్వరంపై సిబిఐ విచారణకు సిఫారసు చేయడం సిగ్గుచేటు..**

**ఘోష్ నివేదికను పక్కనపెట్టి సిబిఐ కి అప్పగించడంలో ఆంతర్యం ఏమిటి.?**

**కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ మండిపాటు..**


**షాద్ నగర్ చౌరస్తాలో బీఆర్ఎస్ శ్రేణుల భారీ నిరసన.**



**ప్రజావినికిడి,(షాద్ నగర్):**
తెలంగాణ బీడు భూములకు సాగునీళ్ళు కాలేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం సిబిఐ విచారణకు సిఫారసు చేయడం సిగ్గుచేటని మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.కాలేశ్వరం ప్రాజెక్టుపై సిబిఐ కేసు వేయడాన్ని నిరసిస్తూ మంగళవారం షాద్ నగర్ చౌరస్తాలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి నిరసనలు తెలిపిన అనంతరం మాట్లాడారు. కాలేశ్వరం ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రభుత్వం వేసిన ఘోష్ కమిటీ నివేదికను పక్కనపెట్టి, కేవలం కేసీఆర్ ను బదునాం చేయాలనే ఉద్దేశంతో, దిక్కుమాలిన, కుట్రపూరిత రాజకీయాలకు కాంగ్రెస్ ప్రభుత్వం తెరలేపిందని మండిపడ్డారు.ఉమ్మడి రాష్ట్రంలో అన్ని రంగాలలో వెనుకబడిపోయిన తెలంగాణ ప్రాంతం కేసీఆర్ పాలనలోనే ప్రగతి వైపు నడిచిందని చెప్పారు.పల్లె ప్రజలకు తాగునీలు ఇవ్వడం తప్పా? బీడు భూములకు సాగునీలనివ్వడం నేరమా? రైతులకు రైతుబంధు,రైతు బీమా వంటి పథకాలను అందించడం మోసమా ? అని ప్రశ్నించారు.దేశంలోని ఎక్కడలేని విధంగా రైతు సంక్షేమం కోసం, రైతు బాగు కోసం నిరంతరం శ్రమించి కాళేశ్వరం, పాలమూరు ఎత్తిపోతల వంటి సాగునీటి ప్రాజెక్టులను నిర్మించిన గొప్ప నేత, తెలంగాణ అపర భగీరథుడు కేసిఆర్ అనే విషయం తెలంగాణ ప్రజలందరికీ తెలుసని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం వేసిన కమిటీని కాదని, రాజకీయ సిబిఐకి అప్పగించడం దేనికి నిదర్శనమో తెలంగాణ ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి చేయించిన కమిటీ పైనే వాళ్లకు నమ్మకం లేదని, నివేదికలో ఎలాంటి అక్రమాలు జరగలేదని విషయం తేలిపోవడంతో ఏం చేయాలో తోచక సిబిఐ కి అప్పగించారని,ఈ తరహా చర్యలు తెలంగాణ రైతంగాన్ని అవమానపరచడమేనని అభిప్రాయపడ్డారు. కాలేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ నేతలకు కనీస అవగాహన లేదని, బ్యారేజీలు,కాలువలు, ఆయకట్టు, రిజర్వాయర్లు, తూములు,ఎత్తిపోత, టీఎంసీలు, క్యూసెక్కులు,వరద జలాలు,నిఖర జలాలు,మిగులు జలాలు,నదులపై తెలంగాణ హక్కు వంటి అంశాల పైన కాంగ్రెస్ నేతలకు కనీస జ్ఞానం లేదని ఎద్దేవా చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం,సీఎం రేవంత్ రెడ్డి కుట్రపూరిత రాజకీయ తత్వంలను తెలంగాణ ప్రజలు గ్రహిస్తున్నారని, సరైన సమయంలో సరైన సమాధానం చెబుతారని హెచ్చరించారు.నెల రోజుల నుంచి తెలంగాణ రైతులు ఎరువుల కోసం హరిగోస పడుతున్న కనీస చర్యలు తీసుకోవడంలో శ్రద్ధ చూపని రేవంత్ రెడ్డి రైతుల సంక్షేమం కోసం ఆలోచన చేస్తారా? అనే విషయాన్ని తెలంగాణ ప్రజలు గ్రహించాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వంకాయల నారాయణరెడ్డి, రవీందర్ యాదవ్,మాజీ సహకార యూనియన్ చైర్మన్ రాజవరప్రసాద్, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఈట గణేష్,మాజీ మున్సిపల్ చైర్మన్ నరేందర్,మాజీ మార్కెట్ చైర్మన్ మన్నె కవిత నారాయణ, రాజ్యలక్ష్మి, నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు, మాజీ జడ్పీటీసీలు,పీఏసీఎస్ చైర్మన్లు,మాజీ సర్పంచులు,మాజీ ఎంపీటీసీలు,మాజీ కౌన్సిలర్లు,మాజీ ప్రజాప్రతినిధులు,బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# కాళేశ్వరం తెలంగాణ జీవనధార..





## సబితా ఇంద్రారెడ్డి..

**ప్రజావినికిడి,(మహేశ్వరం):**
కేసిఆర్ ని బద్నామ్ చేసేందుకు కాళేశ్వరం పైన వేసిన గోష్ కమిషన్ పైన అగ్నిజ్వాలలై భగ్గుమన్న మహేశ్వరం నియోజకవర్గం గులాబీ దండు..
మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాలాపూర్ చౌరస్తాలో మాజీ మంత్రి మహేశ్వరం నియోజకవర్గము శాసనసభ్యురాలు శ్రీమతి. పి.సబితా ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిరసన ధర్నా కార్యక్రమాలు నిర్వహించారు.
నల్ల బ్యాడ్జీలతో నల్ల జెండాలతో ధర్నా, నిరసన తెలియజేస్తూ కాలేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ఆరోపణలు పూర్తిగా కక్ష సాధింపు రాజకీయాలు అని అగ్ని జ్వాలలై భగ్గుమన్న గులాబీ దండు..

### సీఎం డౌన్ డౌన్

తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన కెసిఆర్ పై కేసుల సిగ్గు సిగ్గు.. వాడెవడు వీడెవడు కెసిఆర్ కు అడ్డెవడు,ప్రాజెక్టులు కట్టిన కేసీఆర్ పై కేసుల సిగ్గు సిగ్గు..కాంగ్రెస్, బిజెపి కుట్రలు నశించాలి నశించాలి అంటూ నిరసన నినాదాలు తో బాలాపూర్ చౌరస్తా గులాబీ శ్రేణుల ఆగ్రహ జ్వాలల నిరసనలతో దద్దరిల్లిపోయినది.
ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ,
కాళేశ్వరం ప్రాజెక్టును బీడు భూమిలో నీళ్ల పారేలా చేసిన అపర భగీరథుడు కేసీఆర్ అని ప్రశంసించారు.
నిరసనలో కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం కావాలని కుట్రపూరితంగా కేసీఆర్ మీద తప్పుడు ఆరోపణలు చేస్తోందని సబితా ఇంద్రారెడ్డి విమర్శించారు.
ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన కాళేశ్వరం ప్రాజెక్టుపై లేనిపోని కథలు సృష్టించి,కమిషన్ పేరుతో కేసీఆర్ ప్రతిష్టను దెబ్బతీయాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని అన్నారు.కాళేశ్వరం ద్వారా లక్షల ఎకరాలకు నీరందించిన ఘనత కేసీఆర్ ది అని కొనియాడారు.
కాంగ్రెస్ ప్రభుత్వం వేసింది పియు ఘోష్ కమిషన్ కాదు..పీసీసీ కమిషన్ అని సబితా ఇంద్రా రెడ్డి ఎద్దేవా చేశారు.జూదములో కౌరవులు గెలిచారు. కానీ యుద్ధంలో పాండవులు గెలిచారు.కేసీఆర్ మీద ఎన్ని ఎంక్వైరీలు పెట్టినా చివరికి న్యాయమే గెలుస్తుంది అని అన్నారు.
కాళేశ్వరం అంటే మేడిగడ్డ ఒక్కటే అన్నట్లు కాంగ్రెస్ నాయకులు వ్యవహరిస్తున్న తీరు వారి తెలివి లేని తనానికి నిదర్శనమని తెలియజేస్తూ,వారు తెలుసుకోవాల్సిన విషయం ఏమిటంటే..కాళేశ్వరం అంటే
3 బ్యారేజీలు, 15 రిజర్వాయర్లు, 19 సబ్ స్టేషన్ లు, 21 పంప్ హౌజులు,203 కిలోమీటర్ల సొరంగాలు,1,531 కిలోమీటర్ల గ్రావిటి కెనాల్,98 కిలోమీటర్ల ప్రెజర్ మెయిన్స్,141 టిఎంసీల స్టోరేజ్ కెపాసిటీ, 530 మీటర్ల ఎత్తుకు లిఫ్ట్,240 టిఎంసీల ఉపయోగం..వీటన్నింటి సమాహారం కాళేశ్వరం అని తెలుసుకోవాలని అన్నారు.కాలేశ్వరంపై కాంగ్రెస్,బిజెపిల నాటకాలను ప్రజలు గమనిస్తున్నారు.వారికి ప్రజలే సరైన బుద్ధి చెబుతారు అని అన్నారు.కాలేశ్వరం ప్రాజెక్ట నిర్మాణంతో తెలంగాణ రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసి దండగా అనుకున్న వ్యవసాయాన్ని పండుగగా మార్చిన అపర భగీరథుడు, తెలంగాణ రాష్ట్ర సాధకులు కెసిఆర్ అని కొనియాడారు.పూర్తికాని ప్రాజెక్టులతో తెలంగాణ రైతాంగం అవస్థలు పడుతుంటే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన పదేళ్ల కాలంలోనే కాళేశ్వరం వంటి భారీ ప్రాజెక్టులను నిర్మించిన కెసిఆర్ ప్రతిష్టను దెబ్బతీసేందుకు, తెలంగాణకు శ్రీరామరక్షగా ఉన్న బిఆర్ఎస్ పార్టీని బద్నాం చేసేందుకే ఇటు రాష్ట్రంలో కాంగ్రెస్,అటు కేంద్రంలోని బిజెపి పార్టీలు దొంగ నాటకాలాడుతున్నాయి అని అన్నారు.
పిసి గోష్ కమిషన్ నివేదికలో కేవలం కాంగ్రెస్..బీజేపీ పార్టీలకు చెందిన మంత్రులు, నాయకులు మాట్లాడిన మాటలే ఉంటాయని, ఇదంతా ఒక బోగస్ కమిషన్ మాత్రమేనని అన్నారు.సబితా ఇంద్రారెడ్డి వారి సందేశాన్ని ముగిస్తూ కాంగ్రెస్ , బీజేపీ లకు సమాధి కట్టే




మరో తెలంగాణ ఉద్యమం మొదలు కాబోతున్నది అని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏ.శ్రీధర్, చిలకమర్రి నరసింహ, మురుకుంట్ల అరవింద్, మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు అర్కల కామేష్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు సునీత బాలరాజ్, పలువురు మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు,మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలుతదితరులు పాల్గొన్నారు.



# షాంఘై సదస్సులో దౌత్య విజయం !



**సెప్టెంబర్2 ప్రజావినికిడి:**
షాంఘై సదస్సు ఎలా ఉన్నా దాని ఫలితాలు మాత్రం ఇండియా కోరుకున్నట్లుగానే కనిపిస్తున్నాయి. ప్రధానంగా పాక్ ప్రధాని షహబాజ్ షరీఫ్‌కు కొంత అవమానకర పరిస్తితి తలెత్తింది. అలాగే ట్రంప్‌కు చురకు అంటించేలా మోడీ, జిన్‌పింగ్,పుతిన్‌లతో స్వేచ్ఛగా కలియతిరుగుతూ కనిపించారు. ఓ రకంగా భారత్, చైనాల మధ్య పెద్దగా సంబంధాలు లేవు. ఈ క్రమంలో తాజా సదస్సు ఓరకంగా ట్రంప్‌కు చెక్ పెట్టేలా ఉందనే భావించాలి. సుంకాలతో రెచ్చిపోతున్న ట్రంప్‌కు ఇది మింగుడు పడని వ్యవహారంగా చూడాలి. అలాగే ట్రంప్ వ్యతిరేక వర్గం కూడా ఈ సదస్సు ద్వారా అమెరికాకు తీవ్రనష్టం కలిగించే వ్యవహారంగా భావిస్తోంది. ఇదే అదనుగా కొందరు అప్పుడే విమర్శలు మొదలు పెట్టారు. ట్రంప్ భారీ సుంకాల మోతల దశలో చైనా వేదికగా సాగిన షాంఘై భేటీ ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇకపోతే పాకిస్థాన్ ప్రధాని షహబాజ్ సమక్షంలోనే షాంఘై సదస్సు వేదికపై భారతదేశానికి అత్యంత కీలకమైన దౌత్య విజయం దక్కింది. భారత్‌లోని కశ్మీర్‌లో జరిగిన పహల్గామ్ ఉగ్రదాడిని ఖండిస్తూ షాంఘై సహకార శిఖరాగ్ర సదస్సు సంయుక్త తీర్మానంలో స్పందన వెలువడింది. ఇతర అంతర్జాతీయ విషయాలతో పాటు ఈ ఉగ్రదాడిని ప్రస్తావించిన షాంఘై సదస్సు విషయంలో భారతదేశానికి పూర్తి సంఘీభావం, సంపూర్ణ సహకారం ఉంటుందని ప్రకటించింది. రెండు నెలల క్రితం క్వింగ్దావో షాంఘైసదస్సులో తమ పట్టు నెగ్గకపోవడంతో వాకౌట్‌కు దిగిన భారత్ ఇప్పుడు తన పంతం నెగ్గించుకుంది. ఎప్రిల్ 22వ తేదీన పహల్గామ్ ఉగ్రదాడిని సభ్యదేశాలన్ని ఖండిస్తున్నాయని తీర్మానంలో తెలిపారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సంతాపం సానుభూతి వ్యక్తం చేశారు. ఇటువంటి ఉగ్రదాడులకు ప్రేరకులు పాత్రధారులు సూత్రధారులు ఎవరైనా సరైన శిక్షలకు విచారణకు అర్హులు, వారికి తగు శిక్ష పడాల్సిందే అని తెలిపారు. ఉగ్రవాదం వేర్పాటువాదం, తీవ్రవాదం పట్ల ఎటువంటి ఉపేక్ష తగదు. ఏ దేశం కూడా ఉగ్రవాద స్థావరాలకు వేదికలు కారాదు. ఈ క్రమంలో ఎక్కడైనా ప్రయత్నాలు జరిగితే అటువంటి చర్యలను ఆయా దేశాల ప్రభుత్వాలు మొగ్గలోనే తుడిచిపెట్టాల్సి ఉంటుందని ప్రకటించారు. ఉగ్రవాదానికి ఊతం ఇస్తోన్న దేశాలను కూడా ఉగ్రవాద దేశాలుగా ప్రకటించాల్సి ఉందనే భారత్ వాదనకు షాంఘై సదస్సు మద్దతు పలికింది. ఉగ్రవాదం ఏ రూపంలో ఏ కోణంలో ఉన్నా అది గర్హనీయం అవుతుంది. ఉగ్రవాద నిర్మూలనలో ద్వంద్వ ప్రమాణాలు, సాకులు వెతకడం కుదరదు. కేవలం ఈ జటిల సమస్య పరిష్కారమే లక్ష్యంగా అంతర్జాతీయ సమాజం కలిసికట్టుగా సాగాల్సి ఉందని ఈ సదస్సు ద్వారా పిలుపు నిచ్చారు. ఇది ఓ రకంగా పాక్‌కు చెంపదెబ్బగా భావించాలి. అలాగే పాక్‌ను సమర్థించిన చైనాకు కూడా ఓ హెచ్చరికగా చూడాలి. మొత్తంగా ఈ రెండు విషయాల్లో భారత్ ఓ రకంగా దౌత్య విజజయం సాధించిందనే చెప్పాలి. ఎందుకంటే అంతకు ముందు రెండు నెలల క్రితం చైనాలోని క్వింగ్దావోలో జరిగిన షాంఘై సదస్సులో ఇటువంటి ప్రకటన లేకపోవడంపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వాకౌట్ జరిపారు. ఇప్పుడు షాంఘై సదస్సు ద్వారానే భారత్ వాదనకు బలం చేకూరింది. షాంఘై వేదిక పై ప్రసంగించిన ప్రధాని మోడీ ఉగ్రవాదం అణచివేతలో శషభిషలు వద్దు, దాటివేతలు, ద్వంద్వ ప్రమాణాలు పనికి రావని తేల్చిచెప్పారు. పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ పేలవ హాజరీ, చైనా అధినేత జిన్‌పింగ్, రష్యా అధినేత పుతిన్ ఇతర దేశాల అధినేతలతో జరిగిన వార్షిక సదస్సులో ప్రధాని మాట్లాడుతూ ఉగ్రవాదంపై పోరు, కలిసికట్టు- పోరు మానవీయ కోణంలో జరిపే విద్యుక్త ధర్మంగా గుర్తు చేశారు. పాకిస్థాన్‌కు, ఉగ్రవాదానికి మద్దతు ఇస్తోన్న ఇతరులకు ప్రధాని మోడీ ఈ వేదిక నుంచి నిర్థిష్ట హెచ్చరికలు చేశారని గుర్తించాలి. ఇకపోతే ఉగ్రవాదాన్ని భారత్ తిప్పికొడుతుంది. ఈ క్రమంలోనే భారత్ మే 10వ తేదీన ఆపరేషన్ సిందూర్‌ను నిర్వహించింది. ఇతర దేశంలోని ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేసిందని గుర్తు చేశారు. ఇక్కడ మిత్రదేశాల కలయికతో సాగే ఎస్‌సిఒ అంటే సెక్యూరిటీ, కనెక్టివిటి ఆపర్చునిటి అని భద్రతా అనుసంధాన సమాన అవకాశాల వేదిక ఇది కావాలని పిలుపు ఇచ్చారు. ఎస్‌సిఒ మరింత కీలక శక్తి కావల్సి ఉంది. ఇక్కడ నుంచి ప్రాంతీయ సహకారానికి, ప్రపంచ శాంతి సుస్థిరత భద్రతలకు సరైన పిలుపు వెలువడాల్సి ఉందన్నారు. ఎస్‌సిఒ నుంచి నాగరికతల పరిరక్షణ వేదిక కూడా ఏర్పాటు కావల్సి ఉందని పిలుపు నిచ్చారు. ఇకపోతే చైనాలోనే జరిగిన ఈ వేదిక ద్వారా ప్రధాని మోడీ చైనా ప్రతిపాదిత బెల్ట్ రోడ్ ఇన్షియేటివ్ పట్ల నిరసన వ్యక్తం చేశారు. ఇతర దేశాల సార్వభౌమాధికారం, సమగ్రత, ప్రాదేశికతకు సవాలు విసిరే నిర్మాణాల పరస్పరం విశ్వాసం కోల్పోయే స్థితిక తీసుకువస్తాయని హెచ్చరించారు. ఈ దశలో ఆయన పాక్, చైనాలను కలిపి విమర్శించారు. ప్రధాని మోడీ తమ ప్రసంగంలో భారతదేశ ప్రగతి ప్రస్థానం వివరించారు. రిఫార్మ్ పర్ఫాం, ట్రాన్స్‌ఫామ్ ఆర్‌పిటితో కదులుతున్నామని, దీనిని ఈ వేదిక ద్వారా ప్రపంచానికి తెలియచేస్తానని వివరించారు. మొత్తంగా ప్రత్యక్షంగా పాకిస్థాన్‌కు, పరోక్షంగా ట్రంప్‌కు షాంఘై సదస్సు ద్వారా భారత్ గట్టి సమాధానం ఇచ్చినట్లుగా భావిస్తున్నారు. ఇది మన దౌత్య విజయంగా కూడా చూడాలి. అలాగే మన వ్యవహారాలు ఎలా ఉన్నా కలసి నాడవాలని చైనాకు కూడా సూచించారు. రష్యాతో తమ బంధం విడదీయరానిదని తేల్చి చెప్పారు. ట్రంప్ విధిస్తున్న సుంకాలను కలసికట్టుగా ఎదుర్కొనే అవకాశాలను పరోక్షంగా షాంఘై సదస్సు ప్రపంచానిక తెలిపింది. మిగతా దేశాలు కలిసి నడిస్తే నీ పెత్తనం సాగదన్న హెచ్చరికను తెలిపారు. అందుకే ట్రంప్ వ్యతిరేకులు దీనిని అప్పుడే ప్రస్తావిస్తూ రావడం గమనార్హం.

# సవాళ్లు ఎదురైనా..భారత్ 7.8 శాతం వృద్ధి రేటు

**పరోక్షంగా అమెరికాసుంకాలపై ఘాటు వ్యాఖ్యలు -సెమికాన్ ఇండియా సదస్సులో ప్రధాని మోడీ**

న్యూఢిలీ **సెప్టెంబర్2 ప్రజావినికిడి:**
ఎన్ని సవాళ్లు ఎదురైనప్పటికీ భారత్ 7.8 శాతం వృద్ధి రేటును సాధించిందని.. దేశ ఆర్థిక వ్యవస్థ అంచనాలను మించి రాణిస్తోందని ప్రధాని మోడీ అన్నారు. దిల్లీలోని యశోభూమిలో నిర్వహించిన సెమీకాన్ ఇండియా 2025 సదస్సులో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికా విధిస్తున్న సుంకాలను ఉద్దేశిస్తూ.. ప్రధాని నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇతరుల ఆర్థికస్వార్థం వల్ల ప్రపంచ పరిస్థితుల్లో అనిశ్చితి నెలకొన్నప్పటికీ భారత్ మాత్రం స్థిరంగా అభివృద్ధి వైపు ముందడుగు వేస్తోందన్నారు. ప్రపంచంలోని వివిధ కంపెనీలు మేకిన్ ఇండియా కోసం భారత్‌కు రావాలని.. ప్రపంచం కోసం తయారీలు చేపట్టాలని పిలుపునిచ్చారు. సెమీకాన్ ఇండియా 2025 సదస్సులో 40 దేశాల ప్రతినిధులు పాల్గొనడంపై సంతోషం వ్యక్తంచేశారు. తమ ప్రభుత్వ పాలనలో భారత్‌లో రాజకీయ స్థిరత్వం, ఆర్థిక స్థిరత్వం, విధానాల్లో పారదర్శకత వంటి పలు మార్పులు చోటుచేసుకున్నాయని అన్నారు. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న భారత్.. త్వరలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుందని విశ్వాసం వ్యక్తంచేశారు. ఈ వృద్ధి కేవలం ఒకే రంగానికి పరిమితం కాకుండా అన్నిరంగాల్లో కనిపిస్తోందని మోదీ అన్నారు. ఆర్థిక స్వార్థం వల్ల ఎదురయ్యే సవాళ్లు ఎదుర్కొంటామని ప్రధాని మోడీ అన్నారు. జూన్ త్రైమాసికంలో



భారతదేశం బలమైన ఆర్థిక పనితీరును కనబరించిందని ప్రశంసించారు. ఆర్థిక స్వార్థం ద్వారా నడిచే సవాళ్లను దేశం ఎలా ఎదుర్కొందో ఇదే చక్కని ఉదాహరణ అన్నారు. భారత్ 7.8 శాతం వృద్ధి రేటును సాధించిందని.. దేశ ఆర్థిక వ్యవస్థ అంచనాలను మించి రాణిస్తోందన్నారు. ఇక భారతదేశంలో సెమీకండక్టర్ భవిష్యత్తును నిర్మించడానికి అంతర్జాతీయ సమాజం సిద్ధంగా ఉందనే స్పష్టమైన సందేశాన్ని సెమికాన్ ఈవెంట్ పంపిందని తెలిపారు. తాము మేడిన్ ఇండియా ఉత్పత్తులను వినియోగిస్తున్నట్లు- ప్రపంచదేశాలన్నీ చెప్పుకొనే రోజు త్వరలోనే రానుందని పేర్కొన్నారు. ప్రపంచ దేశాలకు భారత్‌పై నమ్మకం పెరిగిందనడానికి ఇదే ఉదాహరణ అని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా పోటీ- పెరిగిన తరుణంలోనూ భారత్‌కు ఆదరణ తగ్గలేదన్నారు. భారత్‌పై అమెరికా భారీగా పన్నులు విధిస్తున్న నేపథ్యంలో మోదీ మాటలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ప్రతి పరికరంలో ఇండియన్ మేడ్ చిప్ ఉండాలనేది తమ కల అని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. సెమీకాన్ ఇండియా 2025 సదస్సులో తొలి 'మేకిన్-ఇండియా' మైక్రో ప్రాసెసర్ చిప్‌లను ప్రధాని మోదీకి ఆయన అందించారు. భారత్ తయారుచేసిన విక్రమ్ 32-బిట్ ప్రాసెసర్‌తోపాటు- 4 -టెస్ట్ చిప్స్‌ను అందించారు. ఈ తొలి మైక్రో ప్రాసెసర్ చిప్‌ను ఇస్రో సెమీ కండక్టర్ ల్యాబ్ అభివృద్ధి చేసిందన్నారు. వాహక నౌకల్లో కఠిన వాతావరణ పరిస్థితుల్లోనూ పనిచేసేలా దీనిని రూపొందించినట్లు- తెలిపారు. సెమీ కండక్టర్ ఎకోసిస్టమ్ పెంపొందించడమే లక్ష్యంగా కేంద్రం చర్యలు తీసుకుంటుందన్నారు. కొన్నేళ్ల క్రితం ప్రధాని దూరదృష్టితో ఆలోచించి.. దీనిని ప్రారంభించినట్లు- తెలిపారు. దీంతో కేవలం 3.5 సంవత్సరాల వ్యవధిలో ప్రపంచదేశాలు భారతదేశం వైపు నమ్మకంగా చూస్తున్నాయన్నారు. ప్రస్తుతం దేశంలో ఐదు సెమీకండక్టర్ యూనిట్ల నిర్మాణం వేగంగా జరుగుతోందని అన్నారు. ఇటీవల జపాన్ పర్యటనకు వెళ్లిన ప్రధాని మోదీ భారత్-జపాన్ సంయుక్త ఆర్థిక సదస్సు లో ప్రసంగించారు. సెమీకండక్టర్ల పరిశ్రమల నుంచి స్టార్టప్‌ల వరకూ జపాన్ భారత్‌కు అత్యంత కీలక భాగస్వామిగా ఉందని ప్రధాని పేర్కొన్నారు. జపాన్ సంస్థలు భారత్‌లో 40 బిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడులు పెట్టాయని గుర్తుచేశారు. జపాన్ ప్రధాని ఇషిబాతో ఏఐ, సెమీ కండక్టర్లు, బుల్లెట్ రైలు, పెట్టుబడులే అజెండాగా ద్వైపాక్షిక చర్చలు జరిపారు.

# ఉత్తరాదిలో వర్ష బీభత్సం

**మళ్లీ పెరిగిన వరదలు**

**పలు రాష్ట్రాల్లో వరదలతో అతలాకుతలం**

**ఢిల్లీని ముంచెత్తిన యుమునా వరదలు**

న్యూఢిల్లీ **సెప్టెంబర్2 ప్రజావినికిడి:**
ఉత్తరాది రాష్ట్రాల్లో్ర భారీ వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. వాగులు, వంకలు, నదులు ప్రమాదకర స్థాయిలో ఉధ్భతంగా ప్రవహిస్తున్నాయి. యమునా ఉధృతితో ఢిల్లీ నగరం నీట మునిగింది. ఇప్పటికే ఇళ్లలోకి నీరు చేరుతోంది. దిల్లీలోని యమునా నదిలో నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. నదీ ప్రవాహక ప్రాంతాల్లో నివసించే ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని అధికారులు సూచించారు. ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్‌ల్లో కొండచరియలు విరిగిపడి ఏడుగురు మృతిచెందారు. రాష్ట్రంలో పలుచోట్ల ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో సిమ్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడి తండ్రీ, కుమార్తె సహా ఐదుగురు మరణించారు. ఉత్తరాఖండ్‌లోని సోన్‌ప్రయాగ్ గౌరీకుండ్ మధ్య ఉన్న కేదార్‌నాథ్ జాతీయ రహదారిపై కొండచరియలు విరిగిపడి ఇద్దరు మృతిచెందారు. ఆరుగురు గాయపడ్డారు. దీంతో ఈ నెల 3 వరకు



కేదార్‌నాథ్ యాత్రను అధికారులు తాత్కాలికంగా నిలిపివేశారు. ఉత్తరకాశీ జిల్లాలోని కమ్లా నదితో పాటు, దేహ్రాదూన్‌లోని శాలినీ నది, తెహ్రీ జిల్లాలోని అగ్లర్ నది, రుద్రప్రయాగ్‌లోని అలకనందా, మందాకిని నదులు ప్రమాదస్థాయిని మించి ప్రవహిస్తున్నాయి. పంజాబ్, హరియాణా, చండీగఢ్‌ల్లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి. లూథియానాలో అత్యధికంగా 216.70 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పఠాన్‌కోట్, గుర్‌దాస్‌పుర్, ఫాజిల్కా, కపూర్థలా, తరన్‌తరన్, ఫిరోజ్‌పుర్, హోశియార్‌పుర్, అమృత్‌సర్ జిల్లాల్లోని పలు గ్రామాలు నీట మునిగాయి. ఈ ఆరు జిల్లాల్లో మంగళవారం వరకూ భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీచేసింది. పంజాబ్‌లో వర్షాల కారణంగా పలు రైళ్లు రద్దయ్యాయి. రాష్ట్రంలోని 793 రోడ్లను మూసి వేశారు. ఈ నెల 3వరకు అన్ని విద్యాసంస్థలను మూసివేయాలని పంజాబ్ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు ఇచ్చింది. రాజస్థాన్ రాజధాని జైపుర్‌తో సహా పలు ప్రాంతాల్లో వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. రాష్ట్రంలో పిడుగుపాటుకు ఇద్దరు మృతిచెందారు. ఒకరు నదీ ప్రవాహంలో కొట్టుకుపోయారు. జమ్మూ, పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్‌లలో వరదల్లో చిక్కుకొన్న 5 వేల మందిని, 300 మంది పారామిలటరీ దళాల సిబ్బందిని రక్షించామని సైన్యం తెలిపింది. పంజాబ్‌లో ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఆ రాష్ట్ర గవర్నర్ గులాబ్ చంద్ కటారియాతో పాటు- ముఖ్యమంత్రి భగవంత్ మాన్‌తో కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఫోన్‌లో మాట్లాడారు. మరోవైపు జమ్మూకశ్మీర్‌లో వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి అధికారులతో సమీక్షించారు. వరదల్లో నష్టపోయిన పంజాబ్, జమ్మూకశ్మీర్‌లను కేంద్రం అన్ని విధాలా ఆదుకుంటుందని హామీఇచ్చారు.

# వాహనం ఢీకొని పునుగుపిల్లి మృతి

తిరుమల **సెప్టెంబర్2 ప్రజావినికిడి:**తిరుమల రెండో ఘాట్ రోడ్డులో మంగళవారం పునుగుపిల్లి మృతి చెందింది. ఎనిమిదో కిలోమీటరు హరిణి సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో పునుగు పిల్లి మృతి చెందినట్టు- ఫారెస్ట్ అధికారులు గుర్తించారు. అంతరించిపోతున్న అరుదైన జంతువులలో పునుగుపిల్లి ఒకటి అని తెలిపారు. ఘాట్‌రోడ్డులో వాహన దారులు వేగంగా ప్రయాణించవద్దని కోరారు.

-----------

# రైతులను పట్టించుకోని గత ప్రభుత్వం


**అచ్చన్నాయుడు తీవ్ర విమర్శలు**



అమరావతి **సెప్టెంబర్2 ప్రజావినికిడి:**ౖతుల పట్ల కొందరు మొసలి కన్నీరు కారుస్తున్నారు.. రాష్ట్రంలో ఐదేళ్లపాటు- రైతులను అనేక ఇబ్బందులు పెట్టింది ఎవరని ఏపీ వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు ప్రశ్నించారు. వ్యవసాయశాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష అనంతరం సచివాయలంలో ఏర్పాటు- చేసిన
మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు ఎలాంటి సమస్య వచ్చినా వెంటనే స్పందించామని గుర్తు చేశారు. మిర్చి రైతులకు సమస్య వస్తే వెంటనే కేంద్రమంత్రితో సీఎం మాట్లాడారు. ఆహార పంటలు నష్టపోయినప్పుడు ప్రభుత్వాలు ఆదుకోవడం మామూలే. వాణిజ్య పంటల రైతులను కూడా ఆదుకున్న ప్రభుత్వం మాదే. పచ్చి అబద్ధాలు మాట్లాడే ప్రతిపక్ష పార్టీ ఈ రాష్ట్రంలో ఉన్నందు.. వాస్తవాలు మీడియానే ప్రజలకు తెలియజేయాలని అచ్చెన్నాయుడు అన్నారు. గతంలో ఏరోజుకూడ సమీక్షలుచేయలేదని, ఉల్లి రైతులను ఆదోకోలేదన్నారు. కానీ చంద్రబాబు రైతుల సమస్యలపై చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని అన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డికి హైకోర్టులో ఊరట

**కేసులో వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు**



హైదరాబాద్, **సెప్టెంబర్2 ప్రజావినికిడి:**
తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి హైకోర్టులో ఊరట లభించింది. 2021లో నమోదైన కేసులో వ్యక్తిగత హాజరు నుంచి తెలంగాణ హైకోర్టు మినహాయింపు ఇచ్చింది. కౌంటర్ దాఖలు చేయాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వర్ రావును కోర్టు ఆదేశించింది. తదుపరి విచారణ అక్టోబర్ 7వ తేదీకి వాయిదా వేసింది. సైఫాబాద్ పోలీస్‌స్టేషన్‌లో తనపై నమోదైన కేసును కొట్టేయాలని సీఎం రేవంత్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.ఏఐసీసీ పిలుపు మేరకు 2021లో పీసీసీ ఆధ్వర్యంలో రేవంత్ రెడ్డి రాజ్ భవన్ ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఆయనపై కేసు నమోదు అయింది. రేవంత్ రెడ్డిపై పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రస్తుతం నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో ఈ కేసు పెండింగ్‌లో ఉంది. ఈ కేసును కొట్టివేయాలని హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన కోర్ట్.. రేవంత్ రెడ్డికి హాజరు మినహాయింపు ఇచ్చింది. తదుపరి విచారణ వచ్చే నెల 7వ తేదీకి వాయిదా వేసింది. మరోవైపు మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ-ఆర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో తనపై నమోదైన కేసును కొట్టేయాలని పిటిషన్ దాఖలు చేశారు. సృజన్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని తెలంగాణ హైకోర్టు పీపీని ఆదేశించింది. తదుపరి విచారణ వచ్చే నెల 9కి వాయిదా వేసింది.

# ఆసియా కప్‌లో నంబర్ వన్‌గా సూర్యకుమార్ యాదవ్..



సెప్టెంబర్ 9 నుంచి ఆసియా కప్ ప్రారంభం కానుంది. అంతకు ముందు సూర్యకుమార్ యాదవ్ నంబర్ వన్ అయ్యే ఛాన్స్ ఉంది. 2025 ఆసియా కప్ సందర్భంగా టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మతో సహా మొత్తం ఏడుగురు ఆటగాళ్లను ఓడించే అవకాశం ఉంది. టీ20 ఆసియా కప్‌లో అత్యధిక సిక్సర్లు కొట్టిన బ్యాట్స్‌మెన్ రేసు ఇది. ఇందులో సూర్యకుమార్ యాదవ్ నంబర్ 1 కావడానికి కొన్ని అడుగుల దూరంలో ఉన్నాడు.పురుషుల టీ20 ఆసియా కప్‌లో అఫ్గానిస్తాన్ బ్యాట్స్‌మన్ నజీబుల్లా జద్రాన్ అత్యధిక సిక్సర్లు (13) బాదాడు. ఈ ఆటగాడు 8 మ్యాచ్‌ల్లో 35.20 సగటుతో 176 పరుగులు కూడా చేశాడు. ఆసియా కప్‌లో భారత్ తరపున రోహిత్ శర్మ అత్యధిక సిక్సర్లు బాదాడు. రోహిత్ 9 మ్యాచ్‌ల్లో 12 సిక్సర్లు బాదాడు. అతని తర్వాత 10 మ్యాచ్‌ల్లో 11 సిక్సర్లు బాదిన విరాట్ కోహ్లీ వచ్చాడు. టీం ఇండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ప్రస్తుతం 8వ స్థానంలో ఉన్నాడు. 5 మ్యాచ్‌ల్లో 8 సిక్సర్లు బాదాడు. రాబోయే ఆసియా కప్‌లో అతను సులభంగా నంబర్ వన్ అవ్వగలడు. రాబోయే ఆసియా కప్‌లో సూర్యకుమార్ యాదవ్ కేవలం 6 సిక్సర్లు మాత్రమే కొట్టాలి. అతను నంబర్ 1 అవుతాడు. అయితే, అతని పోరాటం 12 సిక్సర్లు కొట్టి రెండవ స్థానంలో ఉన్న రహ్మానుల్లా గుర్బాజ్‌తో ఉంటుంది. ఇద్దరు ఆటగాళ్లు ఆసియా కప్‌లో ఆడుతున్నారు. నజీబుల్లా జద్రాన్‌కు ఆసియా కప్ కోసం ఆఫ్ఘన్ జట్టులో స్థానం లభించలేదు. కాబట్టి, సూర్య పోరాటం నేరుగా రహ్మానుల్లా గుర్బాజ్‌తో ఉంటుంది. ఇద్దరు ఆటగాళ్లు లాంగ్ షాట్లు ఆడటానికి ప్రసిద్ధి చెందారు.చాలా కాలం తర్వాత తిరిగి వస్తున్నందున సూర్యకుమార్ యాదవ్‌కు ఆసియా కప్ కీలక టోర్నమెంట్. ఐపీఎల్ సమయంలో సూర్యకుమార్ యాదవ్ స్పోర్ట్స్ హెర్నియాతో బాధపడ్డాడు. ఆ తర్వాత జర్మనీలో శస్త్రచికిత్స చేయించుకున్నాడు. ఇప్పుడు అతను పూర్తిగా ఫిట్‌గా ఉన్నాడు. సూర్య తన పూర్తి సామర్థ్యంతో ఆడితే, ఆసియా కప్‌లో అత్యధిక సిక్సర్లు కొట్టడం అతనికి కష్టం కాదు.

# హుక్కా తాగే వాళ్లకే ధోనీ జట్టులో చోటు



## ఇర్ఫాన్ పఠాన్ సంచలన వ్యాఖ్యలు

మిండియా మాజీ ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్, మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీపై ఎప్పుడో చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో మళ్ళీ వైరల్ అవుతున్నాయి. తన కెరీర్ పతనం వెనుక ధోనీ హస్తం ఉందని పఠాన్ చేసిన వ్యాఖ్యలు క్రికెట్ అభిమానుల మధ్య చర్చకు దారితీస్తున్నాయి. పఠాన్ ధోనీ పేరును నేరుగా ప్రస్తావించనప్పటికీ, ఆయన వ్యాఖ్యలు ధోనీని ఉద్దేశించే అన్నాడని స్పష్టంగా తెలుస్తోంది. 2009లో శ్రీలంకతో జరిగిన సిరీస్‌లో ఇర్ఫాన్ పఠాన్, తన సోదరుడు యూసుఫ్ పఠాన్‌తో కలిసి జట్టుకు ఒక విజయాన్ని అందించారు. ఆ మ్యాచ్‌లో 28 బంతుల్లో 60 పరుగులు చేయాల్సిన పరిస్థితుల్లో అద్భుతమైన ప్రదర్శన చేసి జట్టును గెలిపించారు. అలాంటి కీలక మ్యాచ్ విన్నింగ్ ప్రదర్శన తర్వాత కూడా పఠాన్‌ను జట్టు నుంచి తొలగించారు. ఈ విషయంపై ఆయన అప్పటి కోచ్ గ్యారీ కిర్‌స్టెన్‌ను అడిగారు. కిర్‌స్టెన్ రెండు కారణాలు చెప్పారని పఠాన్ వెల్లడించాడు.కొన్ని విషయాలు నా చేతుల్లో లేవు" అని కిర్‌స్టెన్ చెప్పారని, తుది జట్టు ఎంపిక కెప్టెన్ చేతుల్లో ఉంటుందని పఠాన్ అన్నాడు. ఆ సమయంలో కెప్టెన్‌గా ధోనీ ఉన్నారని, కాబట్టి నిర్ణయం ధోనీదే అని పరోక్షంగా పేర్కొన్నాడు.జట్టుకు ఏడవ స్థానంలో బ్యాటింగ్ ఆల్‌రౌండర్ అవసరమని జట్టు భావిస్తోందని కిర్‌స్టెన్ చెప్పారని పఠాన్ తెలిపాడు. తన సోదరుడు యూసుఫ్ పఠాన్ బ్యాటింగ్ ఆల్‌రౌండర్ కాగా, తాను బౌలింగ్ ఆల్‌రౌండర్‌నని, అందుకే జట్టులో ఇద్దరిలో ఒకరికే అవకాశం ఉందని పఠాన్ వివరించారు. ఈ వ్యాఖ్యలతో పాటు, ఇర్ఫాన్ పఠాన్ ఒక కీలకమైన వాక్యాన్ని జోడించారు. "ఎవరి గదిలోనో హుక్కా ఏర్పాటు చేయడం, దాని గురించి మాట్లాడటం నాకు అలవాటు లేదు. ఈ విషయం అందరికీ తెలుసు." అని అన్నారు. ఈ వ్యాఖ్యలు ధోనీని లక్ష్యంగా చేసుకుని చేసినట్లుగా భావిస్తున్నారు. ఎందుకంటే, గతంలో ధోనీ హుక్కా తాగుతున్న వీడియోలు వైరల్ అయిన సందర్భాలు ఉన్నాయి. అలాగే, ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ జార్జ్ బెయిలీ కూడా ఒక ఇంటర్వ్యూలో ధోనీ సహచర ఆటగాళ్లతో అప్పుడప్పుడు హుక్కా తాగుతారని తెలిపారు. ఈ నేపథ్యంలో, హుక్కా తాగే ఆటగాళ్లకే ధోనీ జట్టులో ప్రాధాన్యత ఇచ్చేవారనే ప్రచారం కూడా సోషల్ మీడియాలో ఊపందుకుంది. ఈ వ్యాఖ్యల వల్ల ఇర్ఫాన్ పఠాన్ కెరీర్ అద్భుతంగా ఉన్న సమయంలోనే ముగిసిపోయిందని, మంచి ప్రదర్శన చేసినా జట్టులో చోటు దక్కలేదని అభిమానులు అంటున్నారు. పఠాన్ 2003లో అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగుపెట్టి, 2007 టీ20 ప్రపంచకప్ ఫైనల్‌లో 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డును కూడా గెలుచుకున్నారు. కానీ, 2009 తర్వాత అతని కెరీర్ క్రమంగా క్షీణించి, 2020లో రిటైర్మెంట్ ప్రకటించారు. ఈ పాత వ్యాఖ్యలు ఇప్పుడు తిరిగి వైరల్ కావడంతో క్రికెట్ వర్గాల్లో మళ్ళీ చర్చ మొదలైంది. సౌరవ్ గంగూలీ కెప్టెన్సీలో టీమిండియా తరఫున అరంగేట్రం చేసిన ఇర్ఫాన్ పఠాన్ 29 టెస్టులు, 120 వన్డేలు, 24 టీ20 మ్యాచ్‌లు ఆడాడు. 2007 టీ20 ప్రపంచ కప్ గెలవడంలో ఇర్ఫాన్ పఠాన్ కీలక పాత్ర పోషించాడు. ఆ తర్వాత భారత టీ20 జట్టులో అతనికి పెద్దగా అవకాశం రాలేదు.

# రోహిత్ శర్మ రికార్డును బద్దలుకొట్టిన మహ్మద్ వసీం



ఆసియా కప్‌నకు ముందు యుఏఈ టీ20 కెప్టెన్ మహ్మద్ వసీం అద్భుతంగా రాణించాడు. ఆఫ్ఘనిస్తాన్‌తో జరుగుతోన్న ట్రై-సిరీస్ మ్యాచ్‌లో ఈ కుడిచేతి వాటం బ్యాటర్ 37 బంతుల్లో 67 పరుగులు చేసి 6 సిక్సర్లు బాదాడు. దీంతో రోహిత్ శర్మ రికార్డును కూడా బద్దలు కొట్టాడు.అంతర్జాతీయ టీ20లో అత్యధిక సిక్సర్లు కొట్టిన కెప్టెన్‌గా మహ్మద్ వసీం నిలిచాడు. కెప్టెన్‌గా, అతని బ్యాట్ నుంచి 110 సిక్సర్లు వచ్చాయి. ఇది ప్రపంచ రికార్డు.టీ20 కెప్టెన్‌గా 105 సిక్సర్లు కొట్టిన రోహిత్ శర్మను మహ్మద్ వసీం అధిగమించాడు. టీ20 కెప్టెన్‌గా 100 కంటే ఎక్కువ సిక్సర్లు కొట్టిన ఆటగాళ్లు ఈ ఇద్దరు మాత్రమే.ముహమ్మద్ వసీం టీ20ల్లో అద్భుతమైన రికార్డును కలిగి ఉన్నాడు. ఈ కుడిచేతి వాటం బ్యాట్స్‌మన్ 80 మ్యాచ్‌ల్లో 38 కంటే ఎక్కువ సగటుతో 2859 పరుగులు చేశాడు. అతని స్ట్రైక్ రేట్ కూడా 150 కంటే ఎక్కువ. వసీం %ు%20 ఇంటర్నేషనల్‌లో 3 సెంచరీలు, 23 హాఫ్ సెంచరీలు చేశాడు.ముహమ్మద్ వసీం పాకిస్తాన్‌లోని బలూచిస్తాన్‌లో జన్మించాడు. 16 సంవత్సరాల వయస్సు వరకు, ఈ ఆటగాడు పంజాబ్‌లోని మియాన్ చన్ను వీధుల్లో టేప్ బాల్ క్రికెట్ ఆడేవాడు. ఆ తర్వాత, 2017 సంవత్సరంలో, అతను యూఏఈకి వెళ్లాడు. అక్కడ అతను సేల్స్‌మ్యాన్‌గా పనిచేయడం ప్రారంభించాడు. క్లబ్ క్రికెట్ కూడా ఆడాడు. అతని ప్రతిభను ముదస్సర్ అలీ గుర్తించాడు. వసీంకు రెసిడెన్సీ వీసా కూడా లభించింది. 2023 సంవత్సరంలో, ఈ ఆటగాడు యూఏఈకి టీ20 కెప్టెన్ అయ్యాడు. అదే సంవత్సరంలో ఒక క్యాలెండర్ సంవత్సరంలో 100 సిక్సర్లు కొట్టి ప్రపంచ రికార్డు సృష్టించాడు.

# కన్నీటి పర్యంతమైన కరోలినా ముచోవా



ప్రతిష్టాత్మక టెన్నిస్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ యూఎస్ ఓపెన్ 2025లో ఆసక్తికర ఘటన చోటు చేసుకుంది. చెక్ రిపబ్లిక్‌కు చెందిన టెన్నిస్ స్టార్, 11వ సీడ్ కరోలినా ముచోవా మైదానంలోనే కన్నీటి పర్యంతమైంది.ప్రేక్షకుల గ్యాలరీలో మాజీ ప్రియుడు కనిపించడంతో తీవ్ర భావోద్వేగానికి గురైంది. గత గురువారం సోరానా క్రిస్టియానాతో జరిగిన రెండో రౌండ్ మ్యాచ్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ మ్యాచ్‌లో తొలి సెట్‌లో ముచోవా 1-4తో వెనుకంజలో నిలిచిన సమయంలో అకస్మాత్తుగా సర్వ్ చేయకుండా ఆగిపోయింది. ప్రేక్షకుల వైపు సైగ చేస్తూ.. కన్నీళ్లు తుడుచుకుంటూ కనిపించింది. ఆటను తిరిగి ప్రారంభించే ముందు చైర్ అంపైర్‌కు క్షమాపణలు కూడా చెప్పింది. ఈ అనూహ్య ఘటనతో అంతా ఆశ్చర్యానికి లోనయ్యారు. ముచోవా ఎందుకు ఏడ్చిందనేది తెలియక అయోమయానికి గురయ్యారు.బాధను భరిస్తూనే ఆటను కొనసాగించిన ముచోవా అద్వితీయమైన ప్రదర్శనతో విజయాన్ని సొంతం చేసుకుంది. 7-6, 6-7, 6-4 తేడాతో మూడు సెట్లను గెలుచుకుని ముందడుగువేసింది. మ్యాచ్ అనంతరం మీడియా సమావేశంలో పాల్గొన్న ముచోవా.. ఏడ్వడానికి గల కారణాన్ని వెల్లడించింది. తన మాజీ ప్రియుడు ప్రేక్షకుల మధ్య కూర్చుని ఉండటంతోనే భావోద్వేగానికి గురైనట్లు తెలిపింది. 'టెన్నిస్‌కు సంబంధించిన కారణం కాదు. నాకు ఎదురుగా నా మాజీ ప్రియుడు కూర్చున్నాడు. కొన్నిసార్లు అతను ఉండకూడని చోట కనిపిస్తాడు. నేను అతన్ని వెళ్ళిపోమని చెప్పాను. మొదట అతను వెళ్ళలేదు. కానీ తర్వాత నా బాధను చూడలేక వెళ్ళిపోయాడు. అతన్ని చూస్తూ ఆటపై దృష్టి పెట్టడం కష్టంగా అనిపించింది.'అని ముచోవా చెప్పుకొచ్చింది. ఈ టోర్నీలో ముచోవా క్వార్టర్ ఫైనల్ చేరింది. తొలి రౌండ్‌లో అమెరికా స్టార్ వీనస్ విలియమ్స్, రెండో రౌండ్‌లో సోరానా క్రిస్టియా, మూడో రౌండ్‌లో లిండా నోస్కోవా, నాలుగో రౌండ్‌లో మార్తా కోస్ట్యూక్‌ను ఓడించి టోర్నీలో ముందడుగు వేసింది.



# చరిత్ర సృష్టించిన రషీద్ ఖాన్

అఫ్గానిస్థాన్ స్టార్ స్పిన్నర్ రషీద్ ఖాన్ సంచలనం సృష్టించాడు. తాజాగా పాకిస్థాన్, యూఏఈతో జరుగుతున్న ట్రై సిరీస్?లో రషీద్ వరల్డ్ రికార్డు కొట్టాడు. తాజాగా యూఏఈతో జరిగిన మ్యాచ్?లో 3 వికెట్లు పడగొట్టాడు. దీంతో అంతర్జాతీయ టీ20ల్లో అత్యధిక వికెట్లు పడగొట్టిన బౌలర్?గా రషీద్ ఖాన్ చరిత్ర సృష్టించాడు. తాజా మ్యాచ్?లో 3 వికెట్లతో రషీద్.. 165 వికెట్లు పూర్తి చేసుకున్నాడు. దీంతో ఇంటర్నేషనల్ టీ20లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ గా నిలిచాడు. 2015లో అరంగేట్రం చేసిన రషీద్ ఇప్పటిపరకు 98 మ్యాచ్?ల్లో ఆడాడు. ఇందులో 6.07 ఎకనమీతో 165 వికెట్లు నేల కూల్చాడు. ఈ క్రమంలోనే న్యూజిలాండ్ స్టార్ పేసర్ టిమ్ సౌథీ 164 వికెట్లును అధిగమించాడు. 126 మ్యాచ్?ల్లో 164 వికెట్లు పడగొట్టాడు. కాగా, 2025 ఆసియా కప్‌కు సన్నాహకంగా అఫ్గాన్, పాకిస్థాన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ జట్లు ముక్కోణపు సిరీస్ ఆడుతున్నాయి. టోర్నమెంట్‌లో మూడవ జట్టు యుఏఈ. సోమవారం ఆతిథ్య జట్టుతో జరిగిన మ్యాచ్?లో రషీద్ ప్రపంచ రికార్డులో తన పేరును నమోదు చేసుకున్నాడు. ఈ మ్యాచ్?లో యూఏఈని ఓడించడంలో అతడు బంతితో కీలక పాత్ర పోషించాడు. తన నాలుదు ఓవర్ల కోటాలో 21 పరుగులిచ్చి, మూడు వికెట్లు పడగొట్టాడు. ఈ క్రమంలోనే మూడో వికెట్‌తో, రషీద్ అదుదైన ఘనత సాధించాడు. ఇక మ్యాచ్ విషయానికొస్తే, తొలుత బ్యాటింగ్ చేసిన అఫ్గాన్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లు నష్టానికి 188 పరుగులు చేసింది. సెదికుల్లా ఆతల్ (54 పరుగులు), ఇబ్రహీం జర్దాన్ (63 పరుగులు) హాఫ్ సెంచరీలు చేశారు. అజ్మతుల్లా (20), కరిమ్ జనద్ (23) నాటౌట్ చివర్లో మెరుపులు మెరిపించారు. అనంతరం 189 ఛేదనలో దిగిన యూఏఈ, నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 150 పరుగులకు పరిమితం అయ్యింది. దీంతో 38 పరుగుల తేడాతో అఫ్గాన్ మ్యాచ్?లో విజయం సాధించింది.

# గిల్‌పై హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ప్రశంసల జల్లు



టీమిండియా టెస్ట్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌పై హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ప్రశంసల జల్లు కురిపించాడు. భారత క్రికెట్‌లో మోస్ట్ స్టైలిష్ బ్యాటర్ శుభ్‌మన్ గిల్ అని అభిప్రాయపడ్డాడు. ఇంగ్లండ్ పర్యటన అనంతరం టీమిండియా నెల రోజుల పాటు విశ్రాంతి దొరికింది. ఆసియా కప్ 2025తోనే టీమిండియా మళ్లీ మైదానంలోకి అడుగుపెట్టనుంది. యూఏఈ వేదికగా సెప్టెంబర్ 9 నుంచి ఈ టోర్నీ ప్రారంభం కానుండగా.. విశ్రాంతి సమయాన్ని ఆటగాళ్లతో పాటు కోచ్‌లు ఆస్వాదిస్తున్నారు. తాజాగా ఢిల్లీ ప్రీమియర్ లీగ్‌లోని ఓ మ్యాచ్‌కు గౌతమ్ గంభీర్ హాజరయ్యాడు. ఈ సందర్భంగా అతను రాపిడ్ ఫైర్ క్వశ్చన్ రౌండ్‌లో పాల్గొన్నాడు. శుభ్‌మన్ గిల్‌ను మోస్ట్ స్టైలిష్ బ్యాటర్‌గా పేర్కొన్నాడు. క్లచ్‌గా సచిన్ టెండూల్కర్, స్పీడ్‌కు జస్‌ప్రీత్ బుమ్రా, దేశీబాయ్‌గా విరాట్ కోహ్లీ, గోల్డెన్ ఆర్మ్‌గా నితీశ్ రాణా, మిస్టర్ కన్‌స్టిస్టెంట్‌గా రాహుల్ ద్రవిడ్, రన్ మెషీన్‌గా లక్ష్మణ్, మోస్ట్ ఫన్నీ ప్లేయర్‌గా రిషభ్ పంత్ పేర్లను సూచించాడు. డెత్ ఓవర్ స్పెషలిస్ట్‌గా జహీర్ ఖాన్ పేరు పేర్కొన్నాడు. డెత్ ఓవర్ స్పెషలిస్ట్‌గా బుమ్రాను ఎంచుకోవాలని ఉన్నా.. అతనికి స్పీడ్ ట్యాగ్ ఇచ్చానని తెలిపాడు. టీమిండియా వన్డే కెప్టెన్ రోహిత్ శర్మకు గంభీర్ ఎలాంటి ట్యాగ్ ఇవ్వకపోవడం గమనార్హం. గౌతమ్ గంభీర్ పర్యవేక్షణలో టీమిండియా మిశ్రమ ఫలితాలను ఎదుర్కొంది. టెస్ట్‌ల్లో ఘోర పరాజయాలు చవిచూసిన టీమిండియా.. ఛాంపియన్స్ ట్రోఫీలో మాత్రం ఛాంపియన్‌గా నిలిచింది. ఇప్పుడు ఆసియా కప్ 2025లో తమ అదృష్టాన్ని పరీక్షించుకోబోతుంది. ఆసియా కప్‌లో విజేతగా నిలిస్తే ఎలాంటి మార్పులు లేకుండా ఆ జట్టునే టీ20 ప్రపంచకప్ 2026కు సిద్ధం చేయనున్నారు. గంభీర్ హెడ్ కోచ్‌గా బాధ్యతలు తీసుకున్న తర్వాత సీనియర్ ఆటగాళ్లు ఒక్కొక్కరుగా జట్టు నుంచి నిష్క్రమిస్తున్నారు. ముందుగా రవిచంద్రన్ అశ్విన్ తప్పుకోగా.. రోహిత్, కోహ్లీ వారం వ్యవధిలోనే టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలికారు.

# చెలరేగిన టీమిండియా చిచ్చర పిడుగు సంజు శాంసన్

కేరళ క్రికెట్ లీగ్‌లో సంజు శాంసన్ ప్రతిభ కొనసాగుతోంది. కొచ్చి బ్లూ టైగర్స్ తరపున ఆడుతున్న శాంసన్ మొదటి మ్యాచ్‌లో కేవలం 13 పరుగులు మాత్రమే చేశాడు. ఈ ఇన్నింగ్స్ తర్వాత, సంజు దూకుడుగా ఆడడం ప్రారంభించాడు. 2025 ఆసియా కప్ జట్టులో ఎంపికైన తర్వాత కీలకమైన సమయంలో అతను శుభ్‌మాన్ గిల్‌తో కలిసి ఓపెనింగ్ స్థానం కోసం పోటీని ఎదుర్కొంటున్నాడు. కొల్లాం సెయిలర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఇన్నింగ్స్ ప్రారంభించిన సంజు శాంసన్ కేవలం 51 బంతుల్లో 7 సిక్సర్లు, 14 ఫోర్లతో 121 పరుగులు చేశాడు. ఆ తర్వాత, త్రిస్సూర్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో శాంసన్ తన అద్భుతమైన బ్యాటింగ్‌తో అందరి దృష్టిని ఆకర్షించాడు. 46 బంతుల్లో 9 సిక్సర్లు, 4 ఫోర్లతో 89 పరుగులు చేశాడు. తిరువనంతపురం రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో అద్భుతమైన బ్యాటింగ్ ప్రదర్శన ప్రదర్శించిన సంజు శాంసన్ 37 బంతుల్లో 5 సిక్సర్లు, 4 ఫోర్లతో 62 పరుగులు చేశాడు. అలెప్పీ రిప్పల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో సంజు శాంసన్ బ్యాట్‌తో 9 సిక్సర్లు, 2 ఫోర్లు కొట్టాడు. ఈ మ్యాచ్‌లో అతను కేవలం 41 బంతుల్లోనే 83 పరుగులు చేశాడు. అంటే సంజు శాంసన్ గత నాలుగు ఇన్నింగ్స్‌లలో 50ం స్కోర్లు సాధించాడు. అలాగే, ఈసారి తన బ్యాట్‌తో 30 సిక్సర్లు, 24 ఫోర్లు కొట్టాడు. ఆ ద్వారా అతను 5 ఇన్నింగ్స్‌లలో మొత్తం 368 పరుగులు చేశాడు. ఈ ఊపుతో, ఆసియా కప్‌కు సిద్ధమవుతున్న సంజు శాంసన్ %ఖూజు% పిచ్‌పై కూడా తుఫాన్ బ్యాటింగ్‌ను ఆశించవచ్చు.





# మార్పు మన ఇంటినుంచే మొదలు కావాలి

## నటి కృతి సనన్ వెల్లడి

హీరోయిన్ కృతి సనన్ మరో ఘనత సాధించారు. 'ఐక్యరాజ్యసమితి పాపులేషన్ ఫండ్' ఇండియాకు లింగ సమానత్వ గౌరవ రాయబారిగా ఎంపికయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ చిత్ర పరిశ్రమలో లింగ వివక్షపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇండస్ట్రీలో హీరోలకు ఉన్నన్ని సౌకర్యాలు హీరోయిన్‌లకు ఉండవని ఆమె తెలిపారు. సౌకర్యాల విషయంలోనే కాదు.. నటీనటులను గౌరవించడంలోనూ అసమానత చూపుతారు. హీరోలకు పెద్దకార్లు, విలాసవంతమైన గదులు కేటాయిస్తారు. ఇది చాలా చిన్న విషయాలే కావచ్చు. కానీ, అలా ఎందుకు చేస్తారని బాధపడతాను. కేవలం కార్లు, సౌకర్యాల గురించే కాదు మహిళలను తక్కువ చేసి చూడడం గురించి నేను మాట్లాడుతున్నాను. హీరోలతో సమానమైన గౌరవానికి మేం కూడా అర్హులమే. షూటింగ్ విషయంలోనూ ఇలానే జరుగుతుంది. హీరోలు సెట్స్‌కు ఆలస్యంగా వస్తారు. కానీ, హీరోయిన్లు మాత్రం -టైం కంటే ముందే వెళ్లి వారి కోసం ఎదురుచూస్తూ ఉండాలి. అసిస్టెంట్ డైరెక్టర్లు నన్ను ముందే సెట్స్‌కు రావాలని పిలుస్తారు. హీరోలకు మాత్రం ఆ మాట చెప్పలేరు. ఇలాంటి ఆలోచనా విధానంలోనే మార్పు రావాలని కృతిసనన్ అభిప్రాయపడ్డారు. ఇక తన తల్లి గురించి కృతి కొన్ని విషయాలను ప్రస్తావించారు. ఆమె ఎంతో కష్టపడి ఉన్నతస్థాయికి వచ్చినట్లు- తెలిపారు. మా అమ్మ పెరిగిన వాతావరణంలో పురుషులను ఎక్కువగా గౌరవించేవారు. మహిళలు అంటే కేవలం వంట గదికే పరిమితం అని భావించేవారు. ఈత, నృత్యం నేర్చుకోవాలని ఆమె అప్పట్లో ఎన్నో కలలు కన్నది.. కానీ, కుదర్లేదు. చదువు కోసం పోరాటం చేసింది. ఇప్పుడు ఆమె ప్రొఫెసర్. ఆ పోరాటస్ఫూర్తితోనే నన్ను, నా సోదరిని పెంచింది. మాకు ఎలాంటి నిబంధనలు పెట్టకుండా స్వేచ్ఛనిచ్చిందఅని తెలిపారు. మార్పు ముందు ఇంట్లో నుంచే ప్రారంభం కావాలని కృతి అన్నారు.

# గంజాయి స్మగ్లింగ్ ఆధారంగా ఘాటి

## పుష్పతో పోలుస్తూ నెట్టింట కామెంట్స్




బాహుబలి, అరుంధతి తర్వాత 'ఘాటి'తో మరోసారి తన పవర్ చూపేందుకు అనుష్క సిద్ధమయ్యారు. క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో ఆమె నటించిన ఈ చిత్రం సెప్టెంబర్ 5న ప్రేక్షకుల ముందుకురానుంది. అయితే, ఈ సినిమా ట్‌ఇలర్ విడుదలైన నాటినుంచి అనుష్క నటనను పుష్పలోని అల్లు అర్జున్ పాత్రతో పోలుస్తూ కొన్ని పోస్టులు వెలువెడుతున్నాయి. ఈ సినిమాలో అనుష్క గంజాయి స్మగ్లింగ్ చేసే ఘాటి శీలావతిగా కనిపించున్నారు. తాము చేస్తున్న పని తప్పని తెలుసుకొని ఆ నేర వృత్తి నుంచి బయటకొచ్చి.. గంజాయి ముఠాను నడిపించే వ్యవస్థపై తిరుగుబాటు- చేసే పవర్‌ఫుల్ పాత్రగా క్రిష్ దీన్ని తీర్చిదిద్దారు. 'పుష్ప'లోనూ ఎర్ర చందనం స్మగ్లింగ్ చేసే పాత్రలో అల్లు అర్జున్ కనిపించిన విషయం తెలిసిందే. తాజా ఇంటర్వ్యూలో అనుష్క ఈ క్రాస్ ఓవర్‌పై స్పందించారు. ఇది చాలా మంచి ఐడియా అని.. అదే జరిగితే ఆడియన్స్‌కు థ్రిల్ ఖాయమన్నారు. క్రిష్ దర్శకత్వంలో మరోసారి నటించడంపై అనుష్క స్పందించారు. వేదం సినిమాలో సరోజ పాత్ర ఇప్పుడు 'ఘాటి'లో శీలావతి.. రెండింటినీ నేను ఎప్పటికీ మర్చిపోలేను. క్రిష్ నన్ను నమ్మి ఇలాంటి అవకాశం ఇవ్వడం గౌరవంగా ఉంది. 2023లో నాకు 'ఘాటి' గురించి చెప్పారు. ఆసక్తిగా అనిపించింది. నా కెరీర్‌లో గుర్తుండిపోయే పాత్రల్లో ఇదీ ఒకటవుతుందని తెలిపారు. 'పుష్ప', 'ఘాటి'లపై దర్శకుడు క్రిష్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. నేను ఏ సినిమా తీసినా సొసైటీ-పై నిబద్ధతతోనే తీస్తాను. 'పుష్ప' సినిమా ఒక వ్యక్తి స్వాగ్‌ను చూపుతూ తీసిన చిత్రం. అల్లు అర్జున్ అందులో అద్భుతంగా నటించారు. సుకుమార్ దాన్ని గొప్పగా చిత్రీకరించారు. వైల్డ్‌ఫైర్ అనే దాన్ని ప్రపంచానికి చూపించారు. అది ఒకతరహా.. 'ఘాటి' మరో రకమైన చిత్రం. ప్రస్తుతం సమాజంలో గంజాయి వల్ల ఎన్నో ఘోరాలు జరుగుతున్నాయి. ఈ గంజాయి స్మగ్లింగ్ వెనక చాలా జరుగుతుంది. దీనికి ఎంతోమంది బలైపోతున్నారు. ఈ అంశంపై నేను దీన్ని రూపొందించానని తెలిపారు.

# పవన్ బర్త్ డే స్పెషల్...

## 'ఓజీ' నుంచి అదిరిపోయే గ్లింప్స్...



పవర్ స్టార్ పవన్ కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా ఆయన అభిమానులకు 'ఓజీ' చిత్ర బృందం అదిరిపోయే కానుకను అందించింది. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ సినిమా నుంచి ఓ పవర్‌ఫుల్ గ్లింప్స్‌ను మంగళవారం విడుదల చేసింది. ఈ గ్లింప్స్, సినిమాపై ఉన్న అంచనాలను అమాంతం పెంచేసింది. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉంది.

యువ దర్శకుడు సుజీత్ దర్శకత్వంలో ఈ చిత్రం గ్యాంగ్‌స్టర్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతోంది. తాజాగా విడుదల చేసిన గ్లింప్స్‌లో పవన్ కల్యాణ్‌ను మునుపెన్నడూ చూడని రీతిలో అత్యంత పవర్‌ఫుల్‌గా చూపించారు. విజువల్స్, నేపథ్య సంగీతం సినిమా ఏ స్థాయిలో ఉండబోతోందో తెలియజేస్తున్నాయి. అభిమానుల నుంచి ఈ గ్లింప్స్‌కు అద్భుతమైన స్పందన వస్తోంది.

ఈ సినిమాలో పవన్ కల్యాణ్ సరసన ప్రియాంక అరుల్ మోహన్ హీరోయిన్‌గా నటిస్తుండగా, బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మీ ప్రతినాయకుడి పాత్రలో కనిపించనున్నారు. అర్జున్ దాస్, ప్రకాశ్ రాజ్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై డీవీవీ దానయ్య ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. తమన్ సంగీతం అందిస్తున్నారు. కాగా, ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 25న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నారు.

# అనిరుధ్ చేతుల్లోకి ఖైదీ-2 సంగీతం

తమిళ హీరో కార్తీ, తమిళ దర్శకుడు లోకేష్ కనగరాజ్ కాంబోలో వచ్చిన బ్లాక్‌బస్టర్ యాక్షన్ థ్రిల్లర్ ఖైదీ . 2019లో విడుదలైన ఈ చిత్రం కార్తీ కెరీర్‌లో మంచి విజయాన్ని నమోదు చేసింది. అయితే ఈ సినిమాకు సీక్వెల్ ఎప్పుడు రాబోతుందా అని ప్రేక్షకులు ఎదురుచూస్తున్న విషయం తెలిసిందే. కూలీ సినిమా విడుదల తర్వాత ఖైదీ 2 ఉండబోతుందని దర్శకుడు లోకేష్ కనగరాజ్ ఇప్పటికే ప్రకటించాడు. దీంతో త్వరలోనే ఈ సినిమా సెట్స్ మీదకి వెళ్లనుంది. అయితే ఈ సినిమా సంగీత దర్శకుడికి సంబంధించిన ఒక విషయం ప్రస్తుతం హాట్‌టాప్‌కిగా మారడంతో పాటు- అభిమానులలో అందోళనకి గురిచేస్తుంది. ఇంతకీ ఆ విషయం ఏమిటంటే..తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న దర్శకుడు లోకేష్ కనగరాజ్ మాట్లాడుతూ.. తన తదుపరి సినిమాలన్నింటికీ అనిరుధ్ రవిచందర్‌తోనే కలిసి పనిచేస్తానని సంచలన ప్రకటన చేశాడు. అనిరుధ్ రిటైర్ అయ్యేంతవరకు మరొకరితో పనిచేయబోనని లోకేష్ తెలిపాడు. దీంతో లోకేష్ చేసిన వ్యాఖ్యలు 'ఖైదీ' అభిమానులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. 'ఖైదీ' మొదటి భాగం బ్లాక్ బస్టర్ హిట్ కావడానికి ముఖ్య కారణం సంగీత దర్శకుడు సామ్ సి.ఎస్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్. పాటలు లేని ఈ చిత్రానికి సామ్ అందించిన బీజీఎం ప్రాణం పోసింది. ముఖ్యంగా కార్తీ బిర్యానీ తినే సీన్‌లో వచ్చే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అయితే సినిమాకే హైలైట్‌గా నిలిచింది. దీంతో 'ఖైదీ 2'లో కూడా సామ్ సి.ఎస్. మ్యాజిక్‌ను మరోసారి చూస్తామని అభిమానులు ఆశించారు. అయితే సడన్‌గా లోకేష్ మాత్రం నేను అనిరుధ్‌తో తప్ప ఇంకా ఎవరితో పని చేయనని చెప్పడం మూవీ లవర్స్‌ని అందోళన పరుస్తుంది. అనిరుధ్ గొప్ప సంగీత దర్శకుడే అయినప్పటికీ 'ఖైదీ' మొదటి భాగంలో సామ్ సి.ఎస్. సృష్టించిన బీజీఎం స్థాయిని ఆయన అందుకోగలరా అని అభిమానులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు- 'ఖైదీ 2' చిత్రం మరింత ఆలస్య మయ్యే అవకాశాలు ఉన్నాయని కూడా వార్తలు వస్తున్నాయి. లోకేష్ 'కూలీ' తర్వాత రజనీకాంత్, కమల్ హాసన్‌లతో ఒక భారీ ప్రాజెక్ట్‌ను రూపొందించే పనిలో ఉన్నారని, అలాగే నటు-డిగా కూడా అరంగేట్రం చేయబోతున్నారని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో 'ఖైదీ 2' ఎప్పుడు మొదలవుతుందనేది ఆసక్తికరంగా మారింది.



# బాలీవుడ్ సినిమా ప్రకటించిన వర్మ..

## మనోజ్ బాజ్‌పేయ్‌తో వర్మ హారర్ కామెడీ!




ఒకప్పుడు తన సినిమాలతో భారతీయ చిత్ర పరిశ్రమలో కొత్త ట్రెండ్ సృష్టించిన సంచలన దర్శకుడు రామ్ గోపాల్ వర్మ మళ్లీ తన పాత ఫామ్‌ను అందుకునే ప్రయత్నంలో ఉన్నారు. చాలా కాలం తర్వాత బాలీవుడ్‌లో ఓ ఆసక్తికరమైన ప్రాజెక్టును ప్రకటించారు. తన కెరీర్‌లో మైలురాయిగా నిలిచిన 'సత్య' చిత్ర హీరో మనోజ్ బాజ్‌పేయ్‌తో కలిసి ఆయన మరోసారి పనిచేయబోతున్నారు. వీరిద్దరి కలయికలో 'పోలీస్ స్టేషన్ మే భూత్' అనే హారర్ కామెడీ సినిమా రాబోతున్నట్లు వర్మ అధికారికంగా వెల్లడించారు. ఈ చిత్రంలో మనోజ్ బాజ్‌పేయ్ సరసన కథానాయికగా జెనీలియా నటించనుంది. సినిమా కథాంశాన్ని కూడా వర్మ స్వయంగా తెలిపారు. ఓ పోలీస్ స్టేషన్‌లో ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్ చేతిలో హతమైన గ్యాంగ్‌స్టర్, దెయ్యంగా మారి అక్కడే తిరుగుతుంటే ఎలాంటి విచిత్ర పరిస్థితులు ఏర్పడతాయనే ఆసక్తికరమైన పాయింట్‌తో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నట్లు వివరించారు. హారర్ చిత్రాలు తీయడంలో సిద్ధహస్తుడైన వర్మ, ఈసారి దానికి కామెడీని జోడించి కొత్త ప్రయోగం చేయబోతున్నారు. రామ్ గోపాల్ వర్మ, మనోజ్ బాజ్‌పేయ్ కాంబినేషన్‌కు బాలీవుడ్‌లో ప్రత్యేక గుర్తింపు ఉంది. వీరిద్దరి కలయికలో గతంలో 'సత్య', 'కౌన్', 'శూల్' వంటి విజయవంతమైన చిత్రాలు వచ్చాయి. ఇప్పుడు చాలా సంవత్సరాల విరామం తర్వాత ఈ ఇద్దరూ కలిసి పనిచేస్తుండటంతో ఈ ప్రాజెక్టుపై సినీ వర్గాల్లో అంచనాలు పెరుగుతున్నాయి. గత కొంతకాలంగా భిన్నమైన, వివాదాస్పద చిత్రాలు తీస్తున్న వర్మ, ఇప్పుడు మళ్లీ ప్రముఖ నటీనటులతో కలిసి మెయిన్ స్ట్రీమ్ సినిమా చేస్తుండటం చర్చనీయాంశంగా మారింది.

# 100 కోట్ల దిశగా 'లోకా' ..



కల్యాణి ప్రియదర్శన్ .. 2017లోనే వెండితెరపైకి అడుగుపెట్టింది. అప్పటి నుంచి తనకి నచ్చిన కథలను మాత్రమే ఎంచుకుంటూ ముందుకు వెళుతోంది. తండ్రి ప్రియదర్శన్ గొప్ప దర్శకుడు అయినప్పటికీ, తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపును కోరుకుంటూ అడుగులు వేస్తోంది. అందువల్లనే ఆమె కెరియర్ కాస్త స్లోగా ఉందేమో అని కూడా అనిపించకమానదు. అలాంటి కల్యాణికి ఇప్పుడు ఒక ఒక భారీ హిట్ తగిలిందనే అనుకోవాలి. ఆ సినిమా పేరే 'లోకా: చాప్టర్ 1- చంద్ర'. డొమినిక్ అరుణ్ దర్శకత్వం వహించిన ఈ సినిమా, ఆగస్టు 28వ తేదీన థియేటర్లకు వచ్చింది. కల్యాణి ప్రియదర్శన్ తో పాటు నెస్లెన్ .. శాండీ ప్రధానమైన పాత్రలను పోషించిన ఈ సినిమా, రిలీజ్ రోజునే హిట్ టాక్ తెచ్చుకుంది. కాన్సెప్ట్ కొత్తగా ఉందని చెప్పుకుంటున్నారు. జేక్స్ బిజోయ్ అందించిన నేపథ్య సంగీతం ఈ సినిమాకి ప్రధానమైన బలంగా నిలిచిందనే టాక్ వినిపిస్తోంది. విడుదలైన 4 రోజుల్లోనే ఈ సినిమా రికార్డుస్థాయి వసూళ్లను రాబట్టడం విశేషం. ఈ సినిమాను 30 కోట్ల బడ్జెట్ తో నిర్మించారు. అయితే 4 రోజుల్లోనే ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా 66 కోట్ల మార్క్ ను టచ్ చేసింది. ప్రస్తుతం ఈ సినిమా స్పీడ్ చూస్తుంటే, 100 కోట్ల మార్క్ ను టచ్ చేయడానికి ఎక్కువ సమయం పట్టదని అంటున్నారు. కల్యాణి ప్రియదర్శన్ ఇంతవరకూ 15 సినిమాలు చేసినప్పటికీ, అసలైన హిట్ ఈ సినిమాతోనే పడిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మొత్తానికి మలయాళ ఇండస్ట్రీ ఈ ఏడాది మరో హిట్ ను తానా ఖాతాలో వేసుకుందన్న మాట.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613